మణుగూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలను నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.



05


TGTEL/26/A2635

# DD9 వార్త

వాస్తవాలు పలుకు

తెలుగు దినపత్రిక






హైదరాబాద్ | సంపుటి: 02 | సంచిక: 73 | 26-07-2026 ఆదివారం | పేజీలు: 08 | వెల: 3/-


## తెలంగాణ కాంగ్రెస్‌లో తుంగతుర్తి చిచ్చు


పీసీసీ చీఫ్‌కు జగ్గారెడ్డి నివేదిక
అధిష్ఠానం చర్యలపై ఉత్కంఠ
మళ్లీ మొదటికి వచ్చిన పంచాయితీ
నాయకుల మధ్య భగ్గుమన్న విభేదాలు
కోమటిరెడ్డి సోదరుల
వర్సెస్ ఎమ్మెల్యే సామేల్
తీవ్ర వ్యాఖ్యలతో రాజుకున్న
రాజకీయ దుమారం



02

## త్యాగం కాదు.. విద్యార్థుల రక్షణే ముఖ్యం

మంత్రి రాజీనామా కంటే విద్యార్థులపై
కేసులు పడకూడదనేదే ప్రాధాన్యం
అందుకే నిరాహార దీక్ష విరమించానన్న వాంగ్ చుక్
రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం
"డీల్ చేసుకుని దీక్ష విరమించలేదు" అంటూ విమర్శలకు కౌంటర్
శాంతియుత నిరసనకారులపై
కేసులు పెట్టబోమని కేంద్రం లిఖితపూర్వక హామీ
పరీక్షల సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చకూ అంగీకారం
* నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న
విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పరిశీలన



02

## విద్యార్థులకు క్షమాపణ చెప్పండి

ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ డిమాండ్
విద్యార్థుల పోరాటానికి రాహుల్ గాంధీ మద్దతు
విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్
సీజేపీ మూడు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి
పోరాటం ఆగదని ప్రతిపక్ష నేత హెచ్చరిక
స్వగృహంలో విద్యార్థులతో సమావేశం
సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న రాహుల్



02

## అమెరికా సెనేట్‌లో సంచలన బిల్లు

మూడేళ్ల పాటు హెచ్-1బీ వీసాల
జారీ నిలిపివేతకు ప్రతిపాదన!
అమెరికా సెనేట్‌లో కొత్త బిల్లు
ప్రవేశపెట్టిన రిపబ్లికన్ సెనేటర్
హెచ్-1బీ వ్యవస్థలో భారీ
మార్పులకు శ్రీకారం
మూడేళ్ల పాటు కొత్త వీసాల
జారీపై తాత్కాలిక నిషేధం
అమెరికన్ కార్మికుల
ప్రయోజనాల రక్షణే ధ్యేయం
లక్ష డాలర్ల ఫీజును
శాశ్వతం చేసేలా ప్రతిపాదన
న్యాయపరమైన వివాదాల
నడుమ కఠిన నిర్ణయం

**సెనేట్, (డిడి9 వార్త):**

అమెరికాలోని విదేశీ నిపుణులకు, ముఖ్యంగా భారతీయ ఐటీ రంగానికి ఊహించని షాక్ తగిలింది. హెచ్ 1బీ వీసాల జారీ విధానంలో భారీ మార్పులు తీసుకువస్తూ అమెరికా సెనేట్‌లో ఒక కీలకమైన మిగతా 2లో..




# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

ప్రధాని నరేంద్ర మోదీకి పంపిన రాజీనామా లేఖ
సామాజిక మాధ్యమం 'ఎక్స్' ద్వారా వెల్లడించిన మంత్రి
కేంద్రంతో 'కాక్రోచ్ జనతా పార్టీ'
మూడో విడత చర్చల వేళ కీలక పరిణామం
గత నెల రోజులుగా జంతర్ మంతర్
వద్ద విద్యార్థుల నిరసనలు
ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామానే
ప్రధాన డిమాండ్‌గా ఉద్యమం
మంత్రి తొలగింపుపై మొండికేసిన సీజేపీ
ఆందోళనకారుల ప్రధాన
డిమాండ్లకు ఓకే చెప్పిన కేంద్రం
కేసుల ఉపసంహరణ, ఆత్మహత్య
చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం
యువత కలలను నెరవేర్చడమే
తమ లక్ష్యమన్న ధర్మేంద్ర ప్రధాన్



**హైదరాబాద్, (డిడి9 వార్త):**

దేశ రాజధానిలో విద్యార్థుల ఆందోళనల నడుమ ఒక ఊహించని కేంద్ర రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. దేశ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా లేఖను ప్రధాని నరేంద్ర మోదీకి పంపించారు.

కేంద్ర ప్రభుత్వానికి, 'కాక్రోచ్ జనతా పార్టీ' (CJP)కి మధ్య మూడో విడత చర్చలు జరగడానికి కొన్ని గంటల ముందే ధర్మేంద్ర ప్రధాన్ తన రాజీనామా విషయాన్ని సామాజిక మాధ్యమం 'ఎక్స్' (ట్విట్టర్) ద్వారా అధికారికంగా ప్రకటించారు. గత నెల రోజులకు పైగా ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన భారీ నిరసనలకు మిగతా 2లో..

# మోదీకి మరో ప్రపంచ రికార్డు

24 గంటల్లో 10 లక్షల కొత్త ఇన్‌స్టా ఫాలోవర్లు
30.3 కోట్ల వ్యూస్‌తో ప్రపంచ రికార్డు
ఫిఫా ఫైనల్‌పై ఐషో స్పీడ్ వీడియో రికార్డు బద్దలు
జెన్-జీ స్టైల్ వీడియోకు యువత నుంచి భారీ స్పందన
స్పందించిన విద్యార్థులకు మరో వీడియోతో ధన్యవాదాలు
సోషల్ మీడియాలో చురుకుగా ఉండాలని మంత్రులకు మోదీ సూచన



**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

ప్రధాని నరేంద్ర మోదీ సోషల్ మీడియాలో మరో అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నారు. నీట్-2026 ప్రశ్నపత్రాల లీకేజీ నేపథ్యంలో విద్యార్థులను ఉద్దేశించి జెన్‌జీ శైలిలో అర్ధరాత్రి విడుదల చేసిన సెల్ఫీ వీడియో ప్రపంచవ్యాప్తంగా భారీ స్పందన దక్కించుకుంది. ఈ వీడియోతో కేవలం 24 గంటల్లోనే మోదీ ఇన్‌స్టాగ్రామ్ ఖాతాకు దాదాపు 10 లక్షల మంది కొత్త ఫాలోవర్లు చేరగా, అదే సమయంలో వీడియోకు 303 మిలియన్ల (30.3 కోట్ల) వీక్షణలు నమోదయ్యాయి. దీంతో 2026 ఫిఫా ప్రపంచకప్ ఫైనల్ సందర్భంగా ఐషో స్పీడ్ విడుదల చేసిన వీడియో పేరిట ఉన్న 300 మిలియన్ల వ్యూస్ రికార్డును అధిగమించినట్లు తెలుస్తోంది.

ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో 100 మిలియన్లకు పైగా (10.2 కోట్లకు పైగా) మిగతా 2లో..

## రియల్ ఎస్టేట్‌లో రికార్డు స్థాయి వృద్ధి

హైదరాబాద్ రియల్ ఎస్టేట్ పడిపోయిందనేది గోబెల్స్ ప్రచారం
వివరాలతో సహా కొట్టిపారేసిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి
రియల్ ఎస్టేట్ రంగం కుదేలైందనే ప్రచారంలో నిజం లేదు
-నగరంలో ప్లాట్ల విక్రయాలు 40 శాతం పెరిగాయని వెల్లడి
హైదరాబాద్ అభివృద్ధికే ప్రపంచ పారిశ్రామికవేత్తల మొగ్గు
దావోస్ పర్యటన అనుభవాలను పంచుకున్న మంత్రి

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ రాష్ట్రంలో, ముఖ్యంగా రాజధాని హైదరాబాద్ నగరంలో రియల్ ఎస్టేట్ రంగం తీవ్రంగా దెబ్బతిన్నదంటూ కొంతమంది కావాలని గోబెల్స్ ప్రచారం చేస్తున్నారని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండిపడ్డారు. శనివారం నగరంలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని స్పష్టం చేశారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ల శాఖ మంత్రిగా తన వద్ద స్పష్టమైన ఆధారాలు, రిజిస్ట్రేషన్ గణాంకాలు ఉన్నాయని, ఇలాంటి దుష్ప్రచారాలను ప్రజలు, మిగతా 3లో..



# అస్సాంను ముంచెత్తిన వరదలు

మృతుల సంఖ్య 62కు పెరుగుదల
12 జిల్లాల్లో 7 లక్షల మందిపై ప్రభావం
856 గ్రామాలు జలదిగ్బంధంలో చిక్కు
56 వేల హెక్టార్లకు పైగా పంటలు నీటమునక
సహాయక శిబిరాల్లో 1.15 లక్షల మంది ఆశ్రయం
ప్రమాద స్థాయికి మించి నాలుగు నదుల ప్రవాహం
యుద్ధ ప్రాతిపదికన సహాయక చర్యలు

**అస్సాం, (డిడి9 వార్త):**

అస్సాంలో వరదల తీవ్రత మరింత పెరిగింది. తాజాగా మరో 14 మంది ప్రాణాలు కోల్పోవడంతో వరదలకు సంబంధించిన మృతుల సంఖ్య 62కు చేరింది. రాష్ట్రంలోని 12 జిల్లాల్లో 7,05,148 మంది వరదల ప్రభావానికి గురికాగా, 856 గ్రామాలు నీట మునిగిపోయాయి. సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. విపత్తు నివేదికల ప్రకారం, తాజా మరణాల్లో చరైదియో జిల్లాలో ఏడుగురు, శివసాగర్‌లో ఆరుగురు, జోర్హాట్‌లో మిగతా 2లో..





## ఎల్‌నినో సవాళ్లకు మైక్రో ఇరిగేషనే పరిష్కారం

మైక్రో ఇరిగేషన్ కంపెనీలతో మంత్రి తుమ్మల భేటీ
రైతులకు అండగా నిలవాలని మంత్రి పిలుపు
డ్రిప్, తుంపర సేద్యంతోనే నీటి ఎద్దడికి చెక్
వేగవంతంగా పనులు పూర్తి చేయాలని ఆదేశం
కార్యాచరణ ప్రణాళికల రూపకల్పనపై దృష్టి
అనుమతుల మంజూరులో జాప్యం ఉండొద్దని స్పష్టం

**హైదరాబాద్, (డిడి9 వార్త):**

తెలంగాణ సచివాలయంలో మైక్రో ఇరిగేషన్ (సూక్ష్మ సాగునీటి) కంపెనీల ప్రతినిధులతో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. వర్షాభావ పరిస్థితులు, ఎల్‌నినో ప్రభావం వల్ల ఎదురయ్యే సవాళ్లను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు కంపెనీలు రైతులకు పూర్తిస్థాయిలో అండగా నిలవాలని మంత్రి ఈ సందర్భంగా పిలుపునిచ్చారు. క్షేత్రస్థాయిలో రైతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అందుబాటులోకి తెచ్చి, నీటి కొరత ప్రభావం పంటలపై పడకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. ఎల్‌నినో సవాళ్లను దాటుకుని రైతులకు మేలు చేయాలంటే డ్రిప్ (బిందు) మరియు తుంపర (స్ప్రింక్లర్) సేద్య విధానాలే ఏకైక పరిష్కార మార్గాలని పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ సిస్టమ్ల ఏర్పాటు పనులను వేగవంతం చేయాలని కంపెనీల ప్రతినిధులను ఆదేశించారు. క్షేత్రస్థాయిలో మైక్రో ఇరిగేషన్ మిగతా 3లో..

# అమెరికా సెనేట్‌లో సంచలన బిల్లు

**మొదటిపేజీ తరువాయి**

నూతన బిల్లు ప్రవేశపెట్టబడింది. మొంటానా రాష్ట్రానికి చెందిన రిపబ్లికన్ సెనేటర్ టిమ్ షీహీ ఈ బిల్లును సభ ముందుకు తీసుకువచ్చారు. దీనికి 'ఎండ్ హెచ్1బీ అబ్యూజ్ యాక్ట్' అని పేరు పెట్టారు. ప్రస్తుతం అమలులో ఉన్న వీసా విధానం తన అసలు లక్ష్యాల నుంచి పక్కదారి పట్టిందని, అందుకే ఈ వ్యవస్థను సమూలంగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని ఆయన స్పష్టం చేశారు.

ఈ కొత్త బిల్లులోని అత్యంత ప్రధానమైన ప్రతిపాదన ఏంటంటే, నూతన హెచ్1బీ వీసాల జారీని వరుసగా మూడేళ్ల పాటు పూర్తిగా నిలిపివేయడం. అమెరికా కంపెనీలు తక్కువ వేతనాలకే విదేశీ నిపుణులను నియమించుకుంటూ, స్థానిక అమెరికన్ కార్మికుల ఉద్యోగ అవకాశాలను దెబ్బతీస్తున్నాయనే విమర్శలు పెరిగిన నేపథ్యంలో ఈ నిర్ణయాన్ని ప్రతిపాదించారు. మూడేళ్ల విరామం తర్వాత, అత్యంత కఠినమైన నిబంధనలు, కచ్చితమైన పరిమితులతో మాత్రమే ఈ వీసా కార్యక్రమాన్ని తిరిగి పునరుద్ధరించాలని బిల్లులో పేర్కొన్నారు.

గతంలో డోనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం హెచ్1బీ దరఖాస్తులపై ప్రతిపాదించిన ఒక లక్ష డాలర్ల భారీ ఫీజును చట్టబద్ధం చేసి, శాశ్వతంగా అమలు చేయాలని ఈ బిల్లు సూచిస్తోంది. అయితే ఈ ఫీజు విధానంపై ఇప్పటికే న్యాయస్థానాల్లో వివాదం నడుస్తోంది. కాంగ్రెస్ అనుమతి లేకుండా ఇటువంటి పన్ను తరహా ఫీజులను విధించే అధికారం ప్రభుత్వానికి లేదని బోస్టన్‌లోని అప్పీల్స్ కోర్టు ఇటీవలే తీర్పు ఇచ్చింది. ట్రంప్ యంత్రాంగం వేసిన స్టే పిటిషన్‌ను కూడా కోర్టు తిరస్కరించినప్పటికీ, ఈ బిల్లు ద్వారా ఆ ఫీజుకు చట్టభద్రత కల్పించాలని రిపబ్లికన్ సెనేటర్ యత్నిస్తున్నారు.

ప్రస్తుతం హెచ్1బీ వీసాల ఎంపిక కోసం నిర్వహిస్తున్న ర్యాండమ్ లాటరీ పద్ధతిని పూర్తిగా రద్దు చేయాలని బిల్లు ప్రతిపాదించింది. దీనికి బదులుగా, ఉద్యోగులకు కంపెనీలు ఇచ్చే వేతనాల ఆధారంగా వీసాలను కేటాయించే నూతన విధానాన్ని తీసుకురావాలని సూచించారు. అత్యధిక జీతాలు చెల్లించే ఉన్నత స్థాయి ఉద్యోగాలకే మొదటి ప్రాధాన్యం ఇవ్వాలని, దీనివల్ల తక్కువ వేతనాలతో విదేశీయులను అమెరికాకు తీసుకురావడం సాధ్యపడదని భావిస్తున్నారు.

ఐటీ రంగంలో విస్తృతంగా ఉన్న థర్డ్ పార్టీ స్టాఫింగ్ ఏజెన్సీలు లేదా కన్సల్టెన్సీల ద్వారా హెచ్1బీ ఉద్యోగులను నియమించుకునే ప్రక్రియను పూర్తిగా నిషేధించాలని బిల్లులో పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగీ నేరుగా సదరు కంపెనీ రోల్స్‌పైనే పనిచేయాల్సి ఉంటుంది. అంతేకాకుండా, హెచ్1బీ వీసాదారులకు ఉన్న ఒకేసారి రెండు ఉద్యోగాలు (మల్టిపుల్ ఎంప్లాయ్‌మెంట్) చేసే వెసులుబాటును కూడా రద్దు చేయాలని ప్రతిపాదించారు.

హెచ్1బీ వీసాదారులకు ఎంతో లబ్ధి చేకూర్చే 'డ్యూయల్ ఇంటెంట్' విధానాన్ని రద్దు చేయాలని ఈ బిల్లు సూచిస్తోంది. అంటే, హెచ్1బీ వీసాతో అమెరికాలో ఉంటూనే శాశ్వత నివాస హోదా (గ్రీన్ కార్డ్) కోసం దరఖాస్తు చేసుకునే అవకాశాలను పరిమితం చేయాలని చూస్తున్నారు. ఇది అమలులోకి వస్తే, వీసా ఉన్నప్పటికీ అమెరికాలో శాశ్వతంగా స్థిరపడాలనుకునే భారతీయ నిపుణుల ఆశలపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉంది. అలాగే కుటుంబ సభ్యులను అమెరికాకు తీసుకువచ్చే నిబంధనలపై కూడా కఠినత్వాలు రానున్నాయి. అమెరికాలో చదువు పూర్తిచేసుకున్న విదేశీ విద్యార్థులకు తాత్కాలికంగా ఉద్యోగాలు చేసుకునేందుకు తోడ్పడే 'ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్' వంటి కార్యక్రమాలను కూడా రద్దు చేయాలని ఈ బిల్లు ప్రతిపాదించింది. దీంతో పాటు, అమెరికా ప్రభుత్వ సంస్థలు ఎలాంటి విదేశీ నాన్‌ఇమిగ్రెంట్ వీసాదారులను ఉద్యోగాల్లోకి తీసుకోకుండా నిషేధించాలని పేర్కొంది. ఈ కఠినమైన ప్రతిపాదనలకు ఇమ్మిగ్రేషన్ అకౌంటబిలిటీ ప్రాజెక్ట్, ఫెడరేషన్ ఫర్ అమెరికన్ ఇమ్మిగ్రేషన్ రిఫార్మ్ వంటి సంస్థలు మద్దతు తెలిపాయి.

ఈ నూతన బిల్లు ప్రతిపాదనలు వెలువడటంతో అమెరికాలోని ఐటీ వర్గాలు, ముఖ్యంగా భారతీయ సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ప్రతి ఏటా హెచ్1బీ వీసాల్లో సింహభాగం దక్కించుకుంటున్న భారతీయులపై ఈ నిబంధనలు నేరుగా దెబ్బకొట్టనున్నాయి. అమెరికాలో ఉద్యోగావకాశాలు సంపాదించడం, అక్కడే సుదీర్ఘకాలం కొనసాగడం రాబోయే రోజుల్లో మరింత క్లిష్టంగా మారనుందని విశ్లేషకులు భావిస్తున్నారు.

# మోదీకి మరో ప్రపంచ రికార్డు

**మొదటిపేజీ తరువాయి**


ఫాలోవర్లతో ప్రపంచంలోనే అత్యధిక మంది అనుసరించే గ్లోబల్ రాజకీయ నాయకుడిగా మోదీ కొనసాగుతున్నారు. "ఫ్రెండ్స్..." అంటూ ప్రారంభమైన ఆయన జెన్‌జీ శైలి ప్రసంగం యువతను విశేషంగా ఆకట్టుకోవడంతో, అదే శైలిని అనుకరిస్తూ వేలాది రీల్స్ సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా జెన్‌జీ తరాన్ని దృష్టిలో పెట్టుకుని మోదీ అనుసరించిన ఈ కొత్త కమ్యూనికేషన్ విధానం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది.

ప్రశ్నపత్రాల లీక్‌లను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న చర్యలను వివరిస్తూ విడుదల చేసిన వీడియోకు విద్యార్థుల నుంచి విశేష స్పందన రావడంపై ప్రధాని సంతోషం వ్యక్తం చేశారు. వారికి ధన్యవాదాలు తెలుపుతూ మరో వీడియోను కూడా విడుదల చేశారు.

ఇదిలా ఉండగా, కేంద్ర మంత్రులు అందరూ సోషల్ మీడియాలో మరింత చురుకుగా ఉండాలని, యువతతో నేరుగా మమేకమవుతూ ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఇటీవల జరిగిన కేంద్ర మంత్రివర్గ సమావేశంలో ప్రధాని మోదీ సూచించినట్లు సమాచారం.

# అస్సాంను ముంచెత్తిన వరదలు

**మొదటిపేజీ తరువాయి**



ఒకరు మృతి చెందారు. శివసాగర్ జిల్లా అత్యధికంగా 3,48,555 మంది బాధితులతో అత్యంత తీవ్రంగా ప్రభావితమైంది. ఆ తర్వాత చరైదియోలో 1,88,404 మంది, జోర్హాట్‌లో 1,26,793 మంది వరదలతో ఇబ్బందులు పడుతున్నారు.

గోలాఘాట్, చరైదియో, దిబ్రూగఢ్, హోజై, నగావ్, బిశ్వనాథ్, జోర్హాట్, ధేమాజీ, శివసాగర్, సోనిత్‌పూర్, కామ్రూప్ (మెట్రో), కార్బీ ఆంగ్‌లాంగ్ జిల్లాలు ప్రస్తుతం వరదల ప్రభావంలో ఉన్నాయి.

రాష్ట్రవ్యాప్తంగా 363 సహాయక శిబిరాలు, సహాయ పంపిణీ కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిలో 1,15,205 మంది ఆశ్రయం పొందుతుండగా, మరో రెండు లక్షల మందికి పైగా బాధితులకు సహాయ సామగ్రి అందిస్తున్నారు. డిఖౌ, దిసాంగ్, ధన్‌సిరి (దక్షిణ), కుషియారా నదులు ప్రమాద స్థాయికి మించి ప్రవహిస్తున్నాయి.

వ్యవసాయ రంగం కూడా తీవ్రంగా దెబ్బతింది. మొత్తం 56,606 హెక్టార్లకు పైగా పంట భూములు వరద నీటిలో మునిగిపోయాయి. గత 24 గంటల్లో 17,107 పశువులు, కోళ్లు వరదలో కొట్టుకుపోగా, మొత్తం 3.34 లక్షల పశువులు, పక్షులు వరదల ప్రభావానికి గురయ్యాయి.

జాతీయ విపత్తు స్పందన దళం (ఎన్‌డీఆర్‌ఎఫ్), రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్‌డీఆర్‌ఎఫ్), సైన్యం, వైమానిక దళం, స్థానిక యంత్రాంగం సహాయక చర్యలను ముమ్మరం చేశాయి. శుక్రవారం ఒక్కరోజే దాదాపు వెయ్యి మందిని వరద ముంపు ప్రాంతాల నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించారు.

ఇదిలా ఉండగా, వరద ప్రభావిత ప్రాంతాలను సందర్శించిన అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వ శర్మ పరిస్థితి అత్యంత ఆందోళనకరంగా ఉందన్నారు. నాగాలాండ్‌లోని మోన్, మోకోక్‌చుంగ్, వోఖా జిల్లాలతో పాటు అస్సాంలో కురిసిన భారీ వర్షాల కారణంగానే చరైదియో, శివసాగర్ జిల్లాల్లో విస్తృతంగా వరదలు సంభవించాయని, పరిస్థితి ఇంకా తీవ్రంగానే ఉందని ఆయన తెలిపారు.

# తెలంగాణ కాంగ్రెస్‌లో తుంగతుర్తి చిచ్చు

- **పీసీసీ చీఫ్‌కు జగ్గారెడ్డి నివేదిక**
- **అధిష్ఠానం చర్యలపై ఉత్కంఠ**
- **మళ్లీ మొదటికి వచ్చిన పంచాయితీ**
- **నాయకుల మధ్య భగ్గుమన్న విభేదాలు**
- **కోమటిరెడ్డి సోదరుల వర్సెస్ ఎమ్మెల్యే సామేల్**
- **తీవ్ర వ్యాఖ్యలతో రాజుకున్న రాజకీయ దుమారం**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీలో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నియోజకవర్గ వివాదం తీవ్ర కలకలం రేపుతోంది. గత కొన్ని రోజులుగా నివురుగప్పిన నిప్పులా ఉన్న వర్గపోరు ఇప్పుడు బహిర్గతమై, పార్టీ శ్రేణుల్లో పెద్ద అలజడికి దారితీసింది. పాత, కొత్త నాయకుల మధ్య ఆధిపత్య పోరు పెరగడంతో తుంగతుర్తి కాంగ్రెస్ వ్యవహారం మళ్లీ మొదటికి వచ్చింది. స్థానిక నాయకుల మధ్య విభేదాలు కాస్తా పార్టీలోని అగ్రనేతల మధ్య మాటల యుద్ధానికి కారణమయ్యాయి.

కోమటిరెడ్డి సోదరులను లక్ష్యంగా చేసుకుని తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారం రేపాయి. "ఎస్సీ నియోజకవర్గమైన తుంగతుర్తిపై మీ ఆధిపత్యం ఏంటి? కాంగ్రెస్ పార్టీ ఏమైనా మీ సొంత జాగీరా?" అని సామేల్ ఘాటుగా ప్రశ్నించారు. ఈ వ్యాఖ్యలపై ఎమ్మెల్యేకు కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అంతే తీవ్ర స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. సామేల్‌కు పార్టీ టికెట్ ఇప్పించి, అసెంబ్లీ ఎన్నికల్లో గెలిపించింది తానేనని ఆయన గుర్తుచేశారు. ఈ ఇద్దరు నేతల మధ్య నడిచిన సవాళ్లు, ప్రతిసవాళ్లతో తుంగతుర్తి రాజకీయం మరింత వేడెక్కింది. ఇటీవల తుంగతుర్తి నియోజకవర్గంలో నిర్వహించిన కాంగ్రెస్ మండల అధ్యక్షుల నియామకం పార్టీలో తీవ్ర చిచ్చు రేపింది. స్థానిక ఎమ్మెల్యే మందుల సామేల్ వర్గం ఒకవైపు, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డితో పాటు పాత కాంగ్రెస్ నేతల వర్గం మరొకవైపు చేరి తీవ్రస్థాయిలో ఘర్షణకు దిగాయి. ఇరువర్గాల మధ్య విభేదాలు ముదిరి పరస్పరం కర్రలు, రాళ్లతో కొట్టుకునే వరకు పరిస్థితి దారితీసింది. దీంతో అధికార పార్టీ ప్రతిష్ట దెబ్బతింటోందని భావించిన అధిష్ఠానం వెంటనే రంగంలోకి దిగింది.

వివాదం తీవ్రరూపం దాల్చడంతో గొడవలను సర్దుబాటు చేసే బాధ్యతను టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డికి అధిష్ఠానం అప్పగించింది. పార్టీ ఆదేశాల మేరకు పరిశీలకుడిగా రంగంలోకి దిగిన జగ్గారెడ్డి, దాదాపు పది రోజుల పాటు నియోజకవర్గ పరిస్థితులను క్షుణ్ణంగా పరిశీలించారు. గొడవలకు కారణమైన ఇరువర్గాల నాయకులతో, స్థానిక కార్యకర్తలతో వేర్వేరుగా సమావేశమై వారి అభిప్రాయాలను, ఫిర్యాదులను సుదీర్ఘంగా విని సమాచారాన్ని సేకరించారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం జగ్గారెడ్డి తుంగతుర్తి ఘటనలపై 7 పేజీలతో ఒక సమగ్ర నివేదికను సిద్ధం చేశారు. హైదరాబాదులోని గాంధీభవన్‌లో రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు (టీపీసీసీ చీఫ్) మహేశ్ కుమార్ గౌడ్‌తో భేటీ అయి ఈ నివేదికను అందజేయనున్నారు. నియోజకవర్గంలో అసలు ఏం జరిగింది, ఘర్షణలకు దారితీసిన పరిస్థితులు ఏంటి, బాధ్యులెవరనే అంశాలను ఆ నివేదికలో స్పష్టంగా పొందుపరిచినట్లు తెలుస్తోంది.

ఈ నివేదిక సమర్పణకు ముందు ఓ వార్తా ఛానెల్‌తో మాట్లాడిన జగ్గారెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. రాజకీయంలో ఇవన్నీ తాను చూసిన అంశాలేనని, ఏ నాయకుడి బలం ఎంత, ఎవరి కెపాసిటీ ఏంటో తనకు బాగా తెలుసని వ్యాఖ్యానించారు. గొప్పలు చెప్పుకునే నాయకులను చాలా మందిని చూశానని, అలాంటివేవీ తన నివేదిక రూపకల్పనను ప్రభావితం చేయలేవని స్పష్టం చేశారు. ఎవరికో ఒకరికి సానుకూలంగా లేదా మరొకరికి వ్యతిరేకంగా నివేదిక ఇవ్వలేదని, పూర్తి నిష్పాక్షికంగా తయారు చేశానని చెప్పారు. పార్టీ నియమావళి ప్రకారం నియోజకవర్గంలో ప్రాధాన్యతలు ఎలా ఉంటాయో జగ్గారెడ్డి మరోసారి స్పష్టం చేశారు. "మొదటి ప్రాధాన్యత ఎప్పుడైనా స్థానిక ఎమ్మెల్యేకే ఉంటుంది. రెండో ప్రాధాన్యత ఎంపీకి, మూడో ప్రాధాన్యత పార్టీ కార్యకర్తల తరఫున డీసీసీ అధ్యక్షుడికి ఉంటుంది" అని ఆయన వ్యాఖ్యానించారు. పార్టీ నియమావళికి, అందరి అభిప్రాయాలకు అనుగుణంగానే ఈ నివేదికను రూపొందించానని, దీనిపై అధిష్ఠానమే తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. జగ్గారెడ్డి సమర్పించనున్న 7 పేజీల నివేదికలో ఏముందనే అంశంపై తెలంగాణ కాంగ్రెస్ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పార్టీ క్రమశిక్షణను ఉల్లంఘించి రోడ్డున పడ్డ నాయకులపై పీసీసీ ఎలాంటి చర్యలు తీసుకుంటుందోనని నాయకులు ఎదురుచూస్తున్నారు. క్రమశిక్షణా చర్యలు తీసుకుంటారా లేక ఇరువర్గాలను పిలిచి సర్దిచెబుతారా అనేది త్వరలోనే తేలనుంది. అధిష్ఠానం నిర్ణయంతోనైనా తుంగతుర్తి పంచాయితీకి పూర్తిస్థాయిలో తెరపడుతుందో లేదో వేచి చూడాల్సి ఉంది.

# విద్యార్థులకు క్షమాపణ చెప్పండి

- **ప్రధాని మోదీకి రాహుల్ గాంధీ డిమాండ్**
- **విద్యార్థుల పోరాటానికి రాహుల్ గాంధీ మద్దతు**
- **విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాల్సిందేనని డిమాండ్**
- **సీజేపీ మూడు డిమాండ్లు నెరవేర్చాలని విజ్ఞప్తి**
- **పోరాటం ఆగదని ప్రతిపక్ష నేత హెచ్చరిక**
- **స్వగృహంలో విద్యార్థులతో సమావేశం**
- **సమస్యలను నేరుగా అడిగి తెలుసుకున్న రాహుల్**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**

దేశవ్యాప్తంగా విద్యార్థులు చేపడుతున్న ఆందోళనలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మరోసారి తీవ్రంగా స్పందించారు. విద్యార్థులు కోరుతున్న ప్రధానమైన మూడు డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల నిరసనలకు పూర్తి మద్దతు ప్రకటిస్తున్నట్లు తెలిపిన ఆయన, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం అలక్ష్యం చేయడం సరికాదని పేర్కొన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు. విద్యాశాఖ నిర్వహణలో విఫలమైన అసమర్థ మంత్రి రాజీనామా చేసేంత వరకు విద్యార్థుల ఉద్యమం ఆగేది లేదని స్పష్టం చేశారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న పాలకులకు గుణపాఠం చెప్పేందుకే యువత రోడ్లపైకి వచ్చి పోరాడుతోందని వ్యాఖ్యానించారు.

శనివారం రోజున ఢిల్లీలోని తన అధికారిక నివాసంలో ఆందోళన నిర్వహిస్తున్న విద్యార్థుల ప్రతినిధులతో రాహుల్ గాంధీ ప్రత్యేకంగా భేటీ అయ్యారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలు, వారి డిమాండ్లు మరియు నిరసనల వివరాలను నేరుగా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశం అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ తీరుపై ఘాటు వ్యాఖ్యలు చేశారు. న్యాయం కోసం శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై కేంద్ర ప్రభుత్వ పరిధిలోని పోలీసులు దారుణంగా దాడులకు పాల్పడుతున్నారని రాహుల్ గాంధీ ఆరోపించారు. తమ హక్కుల కోసం పోరాడుతున్న యువతపై బలప్రయోగం చేయడం దారుణమన్నారు. విద్యార్థులకు రక్షణగా నిలవాల్సిన ప్రభుత్వమే వారిపై దాడులు చేయించడం అణచివేత ధోరణికి నిదర్శనమని మండిపడ్డారు.

దేశంలో లక్షలాది మంది విద్యార్థులు వీధుల్లోకి వచ్చి ఆందోళన చేస్తుంటే, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వీడియోల ద్వారా నాటకాలు ఆడుతున్నారని రాహుల్ గాంధీ విమర్శించారు. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవడాన్ని ఆపి, వారిని ఇబ్బందులకు గురిచేసినందుకు ప్రధాని మోదీ దేశ యువతకు తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. వ్యవస్థలోని లోపాలను, అక్రమాలను ధైర్యంగా ప్రశ్నిస్తున్న విద్యార్థులను చూసి తాను ఎంతో గర్వపడుతున్నానని రాహుల్ గాంధీ అన్నారు. పోరాట బాట పట్టిన ఈ యువతరం భయపడే తరం కాదని, దేశ భవిష్యత్తును తీర్చిదిద్దే శక్తని కొనియాడారు. ఎంతటి ప్రతికూల పరిస్థితులు ఎదురైనా హక్కుల కోసం నిలబడటం అభినందనీయమని చెప్పారు.

ప్రస్తుత విద్యా వ్యవస్థలో పేరుకుపోయిన లోపాలను సరిదిద్దాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అధికారంలో ఉన్న ప్రభుత్వమంతా ఏకమై వచ్చినా, పోరాడుతున్న విద్యార్థుల ఆత్మవిశ్వాసాన్ని కదిలించలేరని స్పష్టం చేశారు. విద్యార్థుల ఐక్యత ముందు ఏ ప్రభుత్వ అణచివేత చర్యలూ నిలబడవని రాహుల్ గాంధీ ధీమా వ్యక్తం చేశారు. విద్యార్థుల పోరాటానికి కాంగ్రెస్ పార్టీ మరియు ప్రతిపక్షాలు పూర్తిస్థాయిలో అండగా ఉంటాయని రాహుల్ గాంధీ పునరుద్ఘాటించారు. వారికి పూర్తిస్థాయిలో న్యాయం జరిగే వరకు ఈ ఉద్యమాన్ని పార్లమెంటు లోపల, వెలుపల కొనసాగిస్తామని చెప్పారు. ప్రభుత్వం దిగివచ్చి విద్యార్థుల డిమాండ్లను తీర్చే వరకు తమ పోరాటం ఆగదని హెచ్చరించారు.

# మై భారత్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని యువతకు పిలుపు

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 25(డిడి9 వార్త):**

యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో అమలవుతున్న మై భారత్ (మేరా యువ భారత్ మై భారత్) కార్యక్రమంలో భాగంగా యువత అధిక సంఖ్యలో నమోదు చేసుకోవాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి కోరారు. యువతలో స్వచ్ఛంద సేవా స్ఫూర్తి, నాయకత్వ లక్షణాలు, సామాజిక బాధ్యతను పెంపొందించడంతో పాటు దేశాభివృద్ధిలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 1 నుంచి ఆగస్టు 15, 2026 వరకు మై భారత్ ఇంటెన్సివ్ యూత్ రిజిస్ట్రేషన్ & అవేర్నెస్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ డ్రైవ్ ద్వారా స్వచ్ఛంద సేవా కార్యక్రమాలు, సమాజాభివృద్ధి కార్యక్రమాలు, నాయకత్వ వికాస శిక్షణలు, వాలంటీరింగ్ అవకాశాలు, వికసిత్ భారత్ 2047 లక్ష్య సాధనలో భాగస్వామ్యం వంటి అనేక అవకాశాలు యువతకు అందుబాటులోకి వస్తాయని పేర్కొన్నారు. అలాగే రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడా కార్యక్రమాల్లో పాల్గొనే అవకాశాలు కూడా ఈ పోర్టల్ ద్వారా కల్పించబడతాయని తెలిపారు. 15 నుంచి 29 సంవత్సరాల మధ్య వయస్సు గల యువతీ యువకులు, విద్యార్థులు, ఎన్‌ఎస్‌ఎస్, ఎన్‌సీసీ, ఎన్‌వైకేఎస్ సభ్యులు తప్పనిసరిగా మై భారత్ పోర్టల్‌లో ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. జిల్లాలోని అన్ని విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు ఈ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సహకరించాలని జిల్లా యువజన మరియు క్రీడల అధికారి విజ్ఞప్తి చేశారు. యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని దేశ నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

# త్యాగం కాదు.. విద్యార్థుల రక్షణే ముఖ్యం

- **సామాజిక కార్యకర్త సోనం వాంగ్ చుక్**
- **మంత్రి రాజీనామా కంటే విద్యార్థులపై కేసులు పడకూడదనేదే ప్రాధాన్యం**
- **అందుకే నిరాహార దీక్ష విరమించానన్న వాంగ్ చుక్**
- **రాజీనామా కోసం కేంద్రంపై ఒత్తిడి కొనసాగుతుందని స్పష్టం**
- **"డీల్ చేసుకుని దీక్ష విరమించలేదు" అంటూ విమర్శలకు కౌంటర్**
- **శాంతియుత నిరసనకారులపై కేసులు పెట్టబోమని కేంద్రం లిఖితపూర్వక హామీ**
- **పరీక్షల సంస్కరణలపై పార్లమెంట్‌లో చర్చకూ అంగీకారం**
- **నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం పరిశీలన**

**న్యూఢిల్లీ, (డిడి9 వార్త):**


కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయకుండానే తన 26 రోజుల నిరవధిక నిరాహార దీక్షను విరమించడంపై వస్తున్న విమర్శలకు పర్యావరణ కార్యకర్త సోనం వాంగ్చుక్ స్పందించారు. మంత్రి రాజీనామా కంటే, ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, నిరసనకారులపై ఎలాంటి పోలీసు కేసులు నమోదు కాకుండా చూడటమే తన తొలి ప్రాధాన్యమని స్పష్టం చేశారు. అందుకే చర్చల్లో రాజీనామా అంశాన్ని గట్టిగా పట్టుబట్టలేదని వెల్లడించారు. శుక్రవారం రాత్రి ఆస్పత్రి నుంచి విడుదల చేసిన 24 నిమిషాల వీడియోలో వాంగ్చుక్ ఈ వ్యాఖ్యలు చేశారు. విద్యా వ్యవస్థలో సంస్కరణలు, పోటీ పరీక్షల్లో అక్రమాలపై చర్యలు, ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా వంటి డిమాండ్లతో కాక్‌రోచ్ జనతా పార్టీ (సీజేపీ) చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా జూన్ 28 నుంచి ఆయన నిరాహార దీక్ష చేస్తున్నారు. చర్చల అనంతరం కేంద్ర ప్రభుత్వం శాంతియుత నిరసనకారులపై ఎలాంటి కేసులు నమోదు చేయబోమని లిఖితపూర్వక హామీ ఇచ్చిందని, పరీక్షల సంస్కరణలు, పేపర్ లీక్‌లపై పార్లమెంట్‌లో విస్తృత చర్చ నిర్వహిస్తామని అంగీకరించిందని తెలిపారు. అలాగే నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు పరిహారం అంశాన్ని కూడా సానుకూలంగా పరిశీలిస్తామని చెప్పిన తర్వాతే తాను దీక్ష విరమించినట్లు వివరించారు.

మంత్రి రాజీనామా తన డిమాండ్లలో ఒకటేనని, అయితే అది తన వ్యక్తిగత విజయంగా సాధించాల్సిన అంశం కాదన్నారు. "రాజీనామా ఇవ్వకపోవడం వల్ల కేంద్ర ప్రభుత్వానికే ప్రజల్లో తీవ్ర నష్టం జరుగుతోంది. చివరికి వారు ఆ నిర్ణయం తీసుకోవాల్సిందేనన్న నమ్మకం నాకు ఉంది. అందుకే నా దృష్టి విద్యార్థుల భద్రతపైనే నిలిచింది" అని వాంగ్చుక్ పేర్కొన్నారు. తాను కేంద్రంతో ఎలాంటి 'డీల్' చేసుకోలేదన్న ఆరోపణలను కూడా ఆయన ఖండించారు. "ఒకవేళ ఒప్పందం చేసుకోవాలనుకుంటే ఢిల్లీలో 26 రోజులు ఎండలో ఆకలితో ఎందుకు ఉండేవాడిని? ఎయిర్ కండిషన్ గదిలో కూర్చొని అదే పని చేసుకునేవాడిని" అని వ్యాఖ్యానించారు.

గతంలో లడఖ్‌లో జరిగిన ఘటనలను గుర్తుచేసుకుంటూ, ఢిల్లీలోనూ నిరసనకారులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందన్న ఆందోళనతోనే తక్షణమే దీక్ష విరమించి శాంతికి పిలుపునిచ్చానని చెప్పారు. అయితే తనతో పాటు ఉద్యమంలో పాల్గొన్న విద్యార్థులు, ఎంపీలు, లడఖ్ ప్రతినిధులు లేకుండానే దీక్ష విరమించాల్సి రావడం తనకు అత్యంత బాధ కలిగించిన విషయమని వాంగ్చుక్ ఆవేదన వ్యక్తం చేశారు.

# ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా!

**మొదటిపేజీ తరువాయి**



ప్రధాన కారణం విద్యాశాఖ మంత్రి రాజీనామా డిమాండే కావడం గమనార్హం. ఈ రాజీనామా అంశంపైనే ప్రభుత్వం, సీజేపీ నాయకుల మధ్య చర్చలు నిలిచిపోయాయి. శనివారం ఉదయం కూడా "ధర్మేంద్ర ప్రధాన్‌ను మంత్రివర్గం నుండి తొలగిస్తేనే తదుపరి చర్చలు ఉంటాయి, లేకపోతే లేవు" అని సీజేపీ స్పష్టం చేసింది. దాంతో ఏర్పడిన రాజ్యాంగ, రాజకీయ సంక్షోభాన్ని నివారించేందుకు మంత్రి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో, ఆందోళనకారులు ప్రతిపాదించిన అన్ని ప్రధాన డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం నెరవేర్చినట్లయింది. విద్యార్థులు ప్రధానంగా మూడు డిమాండ్లను ప్రభుత్వం ముందు ఉంచారు:

1. విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడం,
2. ఆందోళనలు చేస్తున్న విద్యార్థులపై ఎలాంటి చట్టపరమైన కేసులు నమోదు చేయకపోవడం,
3. నీట్ (NEET) పేపర్ లీకేజీ కారణంగా మనస్తాపానికి గురై ఆత్మహత్య చేసుకున్న విద్యార్థుల కుటుంబాలకు తగిన పరిహారం అందించడం.

శుక్రవారం నాటి చర్చల్లో చివరి రెండు డిమాండ్లకు అంగీకరించిన కేంద్ర ప్రభుత్వం, మంత్రి రాజీనామాపై మాత్రం అప్పట్లో ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే శనివారం నాటి పరిణామంతో ఆ డిమాండ్‌ను కూడా నెరవేర్చింది.

తన రాజీనామా ప్రకటనలో ధర్మేంద్ర ప్రధాన్ స్పందిస్తూ — "ఈ దేశ యువత ఆశయాలు, సెంటిమెంట్లు మరియు వారి న్యాయమైన నిరీక్షణలను నేను ఎంతగానో గౌరవిస్తాను. భారతదేశపు యువత కలలను నెరవేర్చడమే నా రాజకీయ, సామాజిక జీవితానికి ఉన్న నైతిక బలం. ప్రధాని నరేంద్ర మోదీ దూరదృష్టి కలిగిన నాయకత్వంలో దేశానికి సేవ చేసే అవకాశం ఇచ్చినందుకు వారికి నా కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను" అని పేర్కొన్నారు.

# రియల్ ఎస్టేట్‌లో రికార్డు స్థాయి వృద్ధి

మొదటిపేజీ తరువాయి

బిల్డర్లు నమ్మాల్సిన అవసరం లేదని తేల్చిచెప్పారు.

గడిచిన రెండున్నరేళ్ల ప్రజా ప్రభుత్వ పాలనలో హైదరాబాద్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా రియల్ ఎస్టేట్ రంగం 15 నుంచి 20 శాతం వృద్ధి సాధించిందని మంత్రి తెలిపారు. ముఖ్యంగా ఓపెన్ ప్లాట్ల విక్రయాలు ఏకంగా 40 శాతం వరకు పెరిగాయని వివరించారు. గత పదేళ్ల కాలంతో పోలిస్తే ఈ రెండున్నరేళ్లలోనే రెసిడెన్షియల్ మార్కెట్ అద్భుతమైన ప్రగతిని నమోదు చేసిందని చెప్పారు. తమ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖలో రికార్డు స్థాయిలో పెరిగిన రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యనే దీనికి ప్రత్యక్ష నిదర్శనమని పొంగులేటి పేర్కొన్నారు. ప్రభుత్వంపై బురద చల్లేందుకు చేసే ప్రయత్నాలను ఆయన ఖండించారు.

2004 నుంచి 2014 వరకు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కాంగ్రెస్ ముఖ్యమంత్రుల దూరదృష్టి వల్లే హైదరాబాద్ రోల్ మోడల్‌గా మారిందని మంత్రి గుర్తుచేశారు. ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, ఐటీ సెక్టార్ వంటివి 360 డిగ్రీల కోణంలో అభివృద్ధి చెందడానికి నాటి దూరదృష్టితో కూడిన నిర్ణయాలే కారణమన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో కలిసి స్విట్జర్లాండ్‌లోని దావోస్ పర్యటనకు వెళ్లినప్పుడు, అంతర్జాతీయ పారిశ్రామికవేత్తలు సైతం హైదరాబాద్ నగరంలో పెట్టుబడులు పెట్టేందుకు ఎంతో ఆసక్తి చూపించారని వెల్లడించారు. ప్రపంచస్థాయి పెట్టుబడులకు హైదరాబాద్ గమ్యస్థానంగా మారిందన్నారు.

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో హైదరాబాద్ నగరాన్ని మరింత ప్రతిష్టాత్మకంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికాబద్ధమైన చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు. సుమారు రూ. 7,000 కోట్ల భారీ అంచనాతో చేపట్టనున్న మూసీ నది పునరుజ్జీవం, సుందరీకరణ ప్రాజెక్టు త్వరలోనే పట్టాలెక్కబోతోందని చెప్పారు. మొదటి విడత కింద 28 కిలోమీటర్ల మేర చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి రాబోయే వారం పది రోజుల్లోనే అధికారికంగా టెండర్లు పిలవబోతున్నామని మంత్రి సభకు వెల్లడించారు. నగరంలో రవాణా వ్యవస్థను మెరుగుపరిచేందుకు రెండో విడత మెట్రో రైలు విస్తరణ పనులను రూ. 24,000 కోట్ల అంచనా వ్యయంతో ప్రారంభించనున్నట్లు మంత్రి ప్రకటించారు. పాతబస్తీతో పాటు నగరంలోని ఇతర కీలక ప్రాంతాలను కలుపుతూ మొత్తం 76 కిలోమీటర్ల మేర ఈ విస్తరణ కొనసాగుతుందన్నారు. దీంతో పాటు రీజనల్ రింగ్ రోడ్డు నుంచి ఔటర్ రింగ్ రోడ్డును అనుసంధానించేలా నూతన రేడియల్ రోడ్ల నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు కూడా చివరి దశలో ఉన్నాయని తెలిపారు.రాష్ట్రంలోని ప్రజల భూములకు పూర్తి భద్రత, భరోసా కల్పించే లక్ష్యంతో తమ ప్రభుత్వం 'భూభారతి' చట్టాన్ని అందుబాటులోకి తీసుకువచ్చిందని పొంగులేటి తెలిపారు. ఈ చట్టానికి సంబంధించిన సాఫ్ట్‌వేర్‌లో ఉన్న కొన్ని చిన్నచిన్న సాంకేతిక సమస్యలను మరో 15 నుంచి 20 రోజుల్లో పూర్తిగా సరిచేసి ప్రజలకు సులభతరమైన సేవలను అందిస్తామని చెప్పారు. ప్రతి ఒక్కరి ఆస్తికి కచ్చితమైన హక్కులు కల్పించడమే తమ ప్రభుత్వ ధ్యేయమని పేర్కొన్నారు. కేవలం వ్యాపార రంగానికే కాకుండా, పేద ప్రజల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో తొలి విడత కింద లక్ష ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులకు అందించాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. దీని తర్వాత దఫదఫాలుగా మరిన్ని ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. పేదల గృహ నిర్మాణాల కోసం దాదాపు 2 నుంచి 3 లక్షల చదరపు అడుగుల స్థలాన్ని సేకరించే ప్రక్రియలో ఉన్నామని మంత్రి వివరించారు. హైదరాబాద్ నగరాన్ని ప్రపంచంలోనే అత్యంత సుందర నగరంగా తీర్చిదిద్దడంలో రియల్ ఎస్టేట్ రంగ ప్రతినిధులు భాగస్వాములు కావాలని మంత్రి పిలుపునిచ్చారు. ప్రజలకు నమ్మకంగా, నిర్దేశిత సమయంలోనే ప్లాట్లు, ఇళ్లను అందించి వారి విశ్వాసాన్ని గెలుచుకోవాలని సూచించారు. బిల్డర్లు, డెవలపర్ల అభ్యర్థన మేరకు రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన అనుమతులు వేగంగా వచ్చేలా 'ఫాస్ట్ ట్రాక్' విధానాన్ని కల్పించేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తుందని మంత్రి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం ఎంపీ రఘురామ్‌రెడ్డి సహా పలువురు ముఖ్య నేతలు పాల్గొన్నారు.

# ఎల్-నినో సవాళ్లకు మైక్రో ఇరిగేషనే పరిష్కారం

మొదటిపేజీ తరువాయి

పరికరాల అమరికలో ఎలాంటి ఆలస్యం జరగకుండా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగాలని స్పష్టం చేశారు.

రాష్ట్రంలో ఇంకా పూర్తి కాకుండా పెండింగ్‌లో ఉన్న డ్రిప్ ప్రాజెక్టులకు సంబంధించి తక్షణమే ఒక స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను (యాక్షన్ ప్లాన్) సిద్ధం చేయాలని మంత్రి కంపెనీలకు నిర్దేశించారు. బీఎంఎస్ , బీఓక్యూ ప్రక్రియలను వెంటనే పూర్తి చేసి, పరిపాలనాపరమైన అనుమతుల కోసం అధికారులకు పంపాలని ఆదేశించారు. క్షేత్రస్థాయి పరిశీలనలు మరియు ప్రభుత్వ అనుమతుల ప్రక్రియలో ఎక్కడా అనవసరమైన జాప్యానికి తావివ్వకూడదని హెచ్చరించారు. డ్రిప్ వ్యవసాయ పద్ధతి ద్వారా తక్కువ నీరు మరియు పరిమిత విద్యుత్‌ను వినియోగించి గరిష్ఠ స్థాయిలో పంట దిగుబడిని సాధించవచ్చని మంత్రి వివరించారు. రాబోయే రోజుల్లో సాంప్రదాయ పంటల నుంచి లాభదాయకమైన ఆల్టర్నేటివ్ (ప్రత్యామ్నాయ) పంటల వైపు రైతులను మళ్లించే పంటల వైవిధ్యీకరణ (క్రాప్ డైవర్సిఫికేషన్) ప్రక్రియలో మైక్రో ఇరిగేషన్ అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తుందని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రోత్సహిస్తున్న ఆయిల్ పామ్ పంట సాగుకు అవసరమైన డ్రిప్ సదుపాయాలను ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే కల్పించాలని మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు మంత్రి తుమ్మల ఆదేశాలు జారీ చేశారు. ఆయిల్ పామ్ రైతులు ఇబ్బంది పడకుండా డ్రిప్ పరికరాల సరఫరా మరియు అమరిక ప్రక్రియలను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని స్పష్టం చేశారు.రైతులకు డ్రిప్ సేద్యం వల్ల కలిగే ప్రయోజనాలపై గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే అవగాహన కార్యక్రమాలు, రైతు సదస్సులలో మైక్రో ఇరిగేషన్ కంపెనీలు తప్పనిసరిగా భాగస్వామ్యం కావాలని మంత్రి సూచించారు. డ్రిప్ సిస్టమ్ల నిర్వహణ, వాడకంపై రైతులకు అవగాహన కల్పించే బాధ్యతను కంపెనీలు తీసుకోవాలని స్పష్టం చేశారు. అదే సమయంలో, కంపెనీలకు రావలసిన పెండింగ్ బిల్లుల చెల్లింపులకు సంబంధించి ప్రభుత్వం సానుకూలంగా ఉంటూ తగిన కృషి చేస్తుందని హామీ ఇచ్చారు.

గత రెండు సంవత్సరాల కాలంలో కాంగ్రెస్ ప్రభుత్వం మైక్రో ఇరిగేషన్ కంపెనీలకు సంబంధించి బకాయి ఉన్న సుమారు రూ. 400 కోట్లను ఇప్పటికే విడుదల చేసిందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ సందర్భంగా వెల్లడించారు. మైక్రో ఇరిగేషన్ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందనడానికి ఈ చెల్లింపులే నిదర్శనమని, ఆర్థిక ఇబ్బందులు లేకుండా కంపెనీలు సేవలను విస్తరించాలని ఆయన కోరారు.సూక్ష్మ సాగునీటి రంగ విస్తరణలో మరియు నీటి యాజమాన్య పద్ధతుల్లో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే అగ్రగామిగా, ఆదర్శవంతంగా నిలవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ లక్ష్య సాధన కోసం



జిల్లాల వారీగా ప్రతి మైక్రో ఇరిగేషన్ కంపెనీ పనితీరుపై నిరంతర సమీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. లక్ష్యాలను సాధించడంలో విఫలమయ్యే లేదా మందకొడిగా పనిచేసే కంపెనీలపై చర్యలు ఉంటాయని సూచనలు చేశారు.

# ప్రతి గ్రామంలో విస్తృతంగా తెలంగాణ జలసిరి కార్యక్రమాలు చేపట్టాలి: మంత్రి సీతక్క

- **ఆగస్టు 15 నాటికి ఇంకుడుగుంతలు, పంట కుంటలు, రీఛార్జ్ పనులు పూర్తి చేయాలి**
- **ఎల్‌నినో ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు భూగర్భ జలాల పెంపుపై ప్రత్యేక దృష్టి**




**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 25(డిడి9 వార్త):**

ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడే వర్షాభావ పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'తెలంగాణ జలసిరి' కార్యక్రమాన్ని ప్రతి గ్రామంలో విస్తృత స్థాయిలో అమలు చేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) అధికారులను ఆదేశించారు.శనివారం అన్ని జిల్లాల అదనపు కలెక్టర్లు (స్థానిక సంస్థలు), డీఆర్‌డీఓలు, జెడ్పీ సీఈఓలు, గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీరాజ్ శాఖల అధికారులు, ఎంపీడీఓలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన మంత్రి సీతక్క, సెర్ప్ సీఈఓ దివ్యదేవరాజన్‌తో కలిసి జలసిరి కార్యక్రమాల అమలుపై సమీక్షించారు. ప్రస్తుత పరిస్థితుల్లో వీబీజీ రామ్‌జీ పథకం కింద గ్రామాల్లో ఇంకుడుగుంతలు, ఊట కుంటలు, పంట కుంటలు, బోరు బావుల రీఛార్జ్ నిర్మాణాలను పెద్ద ఎత్తున చేపట్టాలని సూచించారు.ఈ పనుల ద్వారా భూగర్భ జలాల పెంపుతో పాటు గ్రామీణ కూలీలకు ఉపాధి కూడా కల్పించవచ్చని తెలిపారు.ప్రతి గ్రామంలో గ్రామసభలు నిర్వహించి జల సంరక్షణ అవసరంపై ప్రజలకు అవగాహన కల్పించాలని, వచ్చే ఆగస్టు 15వ తేదీ నాటికి అన్ని గ్రామాల్లో జలసిరి పనులు పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని మంత్రి ఆదేశించారు. రానున్న రోజుల్లో నీటి కొరతను అధిగమించాలంటే ప్రతి వర్షపు చుక్కను భూమిలోకి ఇంకించి భూగర్భ జలాలను పరిరక్షించడం అత్యంత అవసరమని ఆమె పేర్కొన్నారు.జలసిరి కార్యక్రమాల అమలును పర్యవేక్షించేందుకు మండల స్థాయిలో గ్రామీణ నీటి సరఫరా ఏఈ, పంచాయతీరాజ్ ఏఈ, ఎంపీడీఓ, ఎంపీఓ, ఏపీఓలతో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేస్తూ, పండగ వాతావరణంలో కార్యక్రమాలను నిర్వహించాలని కోరారు. వీబీజీ రామ్‌జీ పథకం కింద 318 రకాల పనులు చేపట్టే అవకాశం ఉన్నప్పటికీ, ప్రస్తుతం భూగర్భ జలాల పెంపునకు దోహదపడే జల సంరక్షణ పనులకే అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని మంత్రి స్పష్టం చేశారు. అలాగే వనమహోత్సవంలో భాగంగా పెద్ద ఎత్తున మొక్కలు నాటాలని, గ్రామసభల్లో నిర్ణయించే ప్రతి అభివృద్ధి పని ప్రజలకు ఉపయోగపడేలా ఉండాలని సూచించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) ఎన్.వై. గిరి, జెడ్పీ సీఈఓ చందర్, డీఆర్‌డీఏ పీడీ దామోదర్ రెడ్డి, డీపీఓ మురళి, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.







# ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో హైకోర్టు న్యాయమూర్తుల రెండు రోజుల పర్యటన

- **హైకోర్టు న్యాయమూర్తులను సాదరంగా ఆహ్వానించిన జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 25(డిడి9 వార్త):**

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో రెండు రోజుల అధికారిక పర్యటన నిమిత్తం విచ్చేసిన తెలంగాణ హైకోర్టు గౌరవ న్యాయమూర్తులు జస్టిస్ మాధవీ లత, జస్టిస్ లక్ష్మీనారాయణ, జస్టిస్ ప్రవీణ్ కుమార్‌లకు కామారెడ్డి జిల్లా కేంద్రంలో ఘన స్వాగతం లభించింది.

ఈ సందర్భంగా కామారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి. ముక్తిదా, జిల్లా న్యాయాధికారులు గౌరవ న్యాయమూర్తులను సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, ఐఏఎస్ పూల మొక్కలను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.వి.ఎన్. భారత లక్ష్మి, కామారెడ్డి, నిజామాబాద్ జిల్లాల న్యాయాధికారులు, రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల రెవెన్యూ అధికారులు, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొని గౌరవ న్యాయమూర్తులకు ఆత్మీయ స్వాగతం పలికారు.

తెలంగాణ హైకోర్టు గౌరవ న్యాయమూర్తులు శనివారం, ఆదివారం రెండు రోజులపాటు ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో పర్యటిస్తూ వివిధ న్యాయస్థానాల పనితీరు, న్యాయ పరిపాలనకు సంబంధించిన కార్యక్రమాలను పరిశీలించనున్నారు.



# తొలి ఏకాదశి సందర్భంగా తెలంగాణ పండరీపూర్‌కు భక్తుల పాదయాత్ర

**బాన్సువాడ, జూలై 25(డిడి9 వార్త):**

ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా బీర్కూర్, కోటగిరి,పొతంగల్ మండలంలోని ఆయాగ్రామాలకు చెందిన వార్కరీలు, మహిళలు, చిన్నారులు భక్తిశ్రద్ధలతో తెలంగాణ పండరీపూర్‌గా ప్రసిద్ధి చెందిన బీర్కూర్ మండలం భైరాపూర్‌లోని శ్రీ విట్టల-రుక్మిణి దేవాలయానికి పాదయాత్రగా బయలుదేరారు.

మృదంగాలు, తాళాల నాదాల మధ్య విఠల నామస్మరణ చేస్తూ, భజనలు, ఆధ్యాత్మిక గీతాలు ఆలపిస్తూ భక్తులు ఉత్సాహంగా పాదయాత్ర కొనసాగించారు.చిన్నారులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో యాత్ర భక్తిరసపూరిత వాతావరణంలో సాగింది.విఠలుని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి, రాష్ట్ర ప్రజలకు సుఖశాంతులు, సమృద్ధిగా వర్షాలు కురిసి రైతులు సుభిక్షంగా ఉండాలని భక్తులు ప్రార్థించనున్నట్లు తెలిపారు. తొలి ఏకాదశి సందర్భంగా భైరాపూర్ విట్టల-రుక్మిణి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది.



# బీర్కూర్‌లో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

**బాన్సువాడ, జూలై 25(డిడి9 వార్త):**

ఏకలవ్య జయంతి సందర్భంగా బీర్కూర్ గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఘనంగా నివాళులర్పించారు.ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం జై ఏకలవ్య.. జై జై ఏకలవ్య అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏకలవ్య ఆదివాసీ, గిరిజన సమాజానికి ఆదర్శప్రాయుడని, గురుభక్తి, అంకితభావం, పట్టుదలకు ఆయన ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.యువత ఏకలవ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్య, క్రీడలు, అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ యామ రాములు, ఉపసర్పంచ్ పరమేష్, యువజన నాయకులు మియాపురం శశికాంత్, ఆత్మ కమిటీ సభ్యులు శంకర్, నాయకులు బస్వరాజ్ పటేల్, మాజీ సర్పంచ్ సానెపు గంగారాం, మేకల విట్టల్, పృథ్వి గౌడ్, విజయ్, ఎరుకల సంఘ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.




# జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ తయారీలో నాణ్యత, ఖచ్చితత్వానికి ప్రాధాన్యం: కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 25(డిడి9 వార్త):**

జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ (డిస్ట్రిక్ట్ సెన్సస్ హ్యాండ్‌బుక్-డీసీహెచ్‌బీ) తయారీ ప్రక్రియలో నాణ్యత, ఖచ్చితత్వం, పారదర్శకతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్, ప్రధాన జనగణన అధికారి ఆశిష్ సంగ్వాన్ అధికారులను ఆదేశించారు. శనివారం కామారెడ్డి ఐడీఓసీ మీటింగ్ హాలులో క్షేత్రస్థాయి సిబ్బందికి నిర్వహించిన ప్రత్యేక శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు.జిల్లా జనగణన హ్యాండ్‌బుక్ జిల్లా సామాజిక, ఆర్థిక, భౌగోళిక, పరిపాలనా వివరాలకు ప్రామాణిక ఆధార గ్రంథంగా ఉపయోగపడుతుందని కలెక్టర్ తెలిపారు. అందువల్ల ప్రతి సమాచారాన్ని సంబంధిత రికార్డులతో సరిపోల్చి, ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా నమోదు చేయాలని సూచించారు.శిక్షణలో అందించిన మార్గదర్శకాలను పూర్తిగా అవగాహన చేసుకుని క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా అమలు చేయాలని, రెవెన్యూ, ప్రణాళిక (ప్లానింగ్) తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ నిర్ణీత గడువులోగా నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. నాణ్యమైన సమాచారంతో జిల్లా జనగణన హ్యాండ్‌బుక్‌ను సకాలంలో సిద్ధం చేయడం ప్రతి అధికార బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విక్టర్, హైదరాబాద్ జనగణన అధికారి రమణ, సీపీఓ రఘునందన్, సూపరింటెండెంట్ రాజేశ్వర్ తదితరులు పాల్గొని సిబ్బందికి సాంకేతిక అంశాలపై అవగాహన కల్పించి అవసరమైన సూచనలు చేశారు. క్షేత్రస్థాయి సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.




# గురుభక్తికి ప్రతీక ఏకలవ్యుడు యువతకు ఆదర్శం: సర్పంచ్ ధర్మతేజ

**బాన్సువాడ, జూలై 25(డిడి9 వార్త):**

బీర్కూర్ మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ ఆవరణలో శనివారం ఏకలవ్య జయంతి వేడుకలను గ్రామస్తులు ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ అరిగే ధర్మతేజ ముఖ్య అతిథిగా హాజరై ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు .ఈ సందర్భంగా సర్పంచ్ అరిగే ధర్మతేజ మాట్లాడుతూ, ఏకలవ్యుడు ఎరుకల జాతికి చెందిన మహనీయుడు, గురుభక్తికి ప్రతీక, అపూర్వ విలువిద్యాకారుడని కొనియాడారు. గురువు ద్రోణాచార్యుడు కోరిన వెంటనే తన బ్రొటనవేలిని గురుదక్షిణగా సమర్పించి శిష్యభక్తికి ఆదర్శంగా నిలిచిన గొప్ప వ్యక్తి అని పేర్కొన్నారు. ఏకలవ్యుడు ఎరుకల జాతికి ఆరాధ్య దైవమని, ఆయన జీవితం నేటి యువతకు స్ఫూర్తినిస్తోందని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎరుకల సంఘం అధ్యక్షుడు కుతాడి సాయిలు, క్యాషియర్ పీరయ్య, ఆత్మ కమిటీ సభ్యుడు కుతాడి శంకర్, మాజీ సర్పంచ్ సానెపు గంగారాం, బసవరాజ్ పటేల్, వార్డు సభ్యుడు నవీన్, సంఘ పెద్దలు బ్రహ్మయ్య, బాలయ్య, అంజయ్య, సాయిలు, మహేష్, ప్రభాకర్, సాయి కుమార్, విజయ్, కుతాడి మహేష్, జిన్ను సాయికిరణ్, యువ నాయకులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొని ఏకలవ్యునికి నివాళులర్పించారు.



## అనారోగ్యంతో బాధపడుతున్న యువకుడు మృతి..

**బాన్సువాడ, జూలై 25(డిడి9 వార్త):**



బీర్కూర్ మండలంలోని బీర్కూర్ తాండ గ్రామానికి చెందిన మూడు శ్రీనివాస్ (19),తండ్రి బాబురావు, కూలీ పని చేసుకుంటూ జీవనం సాగించేవాడు.అతడు కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.మృతుని తల్లి మూడు మీరాబాయి రెండు వారాల క్రితం తన కుమార్తె సవిత నివాసముంటున్న ఎడపల్లి మండలం దుబ్బ గ్రామానికి వెళ్లగా, శ్రీనివాస్ ఇంట్లో ఒంటరిగా ఉన్నాడు.ఈ నెల 23న మీరాబాయి తిరిగి ఇంటికి రాగా, శ్రీనివాస్ స్పృహ కోల్పోయి ఇంట్లో పడి ఉండడాన్ని గమనించింది.వెంటనే బంధువులకు సమాచారం అందించగా వారు అతడిని నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ జూలై 24 సాయంత్రం శ్రీనివాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.ప్రాథమిక నివేదిక ప్రకారం, అతడు ఏదో తెలియని గడ్డి మందు సేవించి ఉండవచ్చని వైద్యులు పేర్కొన్నట్లు సమాచారం.ఈ ఘటనపై మృతుని తల్లి మీరాబాయి ఇచ్చిన ఫిర్యాదును బీర్కూర్ ఎస్సై రాములు స్వీకరించి కేసు నమోదు చేసి, అన్ని కోణాల్లో విచారణ చేపడుతున్నట్లు తెలిపారు.




## విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం వద్దు: డీసీసీ అధ్యక్షులు ఏలే మల్లికార్జున్

- **నీట్ పేపర్ లీక్‌పై సమగ్ర విచారణ జరిపి బాధ్యులను శిక్షించాలని డిమాండ్**

**కామారెడ్డి జిల్లా బ్యూరో, జూలై 25(డిడి9 వార్త):**

నీట్ పేపర్ లీక్ వ్యవహారంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుని విద్యార్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ, దేశవ్యాప్తంగా జరుగుతున్న విద్యార్థుల ఉద్యమాలకు సంఘీభావంగా కామారెడ్డి జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) అధ్యక్షులు ఏలే మల్లికార్జున్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలో భారీ కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు.ఈ సందర్భంగా ఏలే మల్లికార్జున్ మాట్లాడుతూ, విద్యార్థులపై నమోదైన కేసులను వెంటనే ఉపసంహరించుకోవాలని, నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని, లోక్‌సభలో నీట్ పేపర్ లీక్ అంశంపై సమగ్ర చర్చ జరపాలని డిమాండ్ చేశారు. అలాగే పేపర్ లీక్ వ్యవహారంపై నిష్పక్షపాత విచారణ నిర్వహించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని కోరారు.విద్యార్థుల న్యాయమైన పోరాటానికి కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల నాయకులు, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యూఐ, మహిళా కాంగ్రెస్, సేవాదళ్ కార్యకర్తలు, విద్యార్థులు, యువతతో పాటు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## నరసాపురంపాఠశాలను సందర్శించిన ఎమ్మెల్యే మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్

- **త్రాగునీటి సరఫర కల్పించాలని ఎమ్మెల్యేకు వినతి**

**జూలై 25 డిడి 9 వార్త దుమ్ముగూడెం**



భద్రాచలం శాసనసభ సభ్యులు డాక్టర్ తెల్లం వెంకట్రావు మరియు భద్రాచలం ఐ.టి.డి.ఏ. ప్రాజెక్ట్ ఆఫీసర్ రాహుల్ శనివారం నాడు నరసాపురం గ్రామంలోని సూది రెడ్డి నాగిరెడ్డి ఆదిలక్ష్మమ్మ మెమోరియల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. పాఠశాలలో మొక్కలను నాటే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగింది. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు అతిథులను ఆహ్వానించడం జరిగింది. పాఠశాల వసతులను గూర్చి శాసనసభ్యులు వెంకట్రావు అడిగి తెలుసుకోవడం జరిగింది. ఈ సందర్భంగా ప్రధాన ఉపాధ్యాయులు మాట్లాడుతూ పాఠశాలలో బాలురకు మూత్రశాలలు మరియు మరుగుదొడ్ల మరమ్మత్తులు చేయించవలసిన అవసరం ఉందని పాఠశాలలో త్రాగునీటి కొరత అధికంగా ఉందని ప్రతినెల 4000 రూపాయలు ఖర్చు పెడుతున్నామని , గ్రామంలోని మిషన్ భగీరథ గ్రిడ్ నుండి డైరెక్ట్ గా పాఠశాలకు కనెక్షన్ ఇప్పించ వలసినదిగా మరియు ఒక బోర్ ని కూడా పాఠశాలలో ఏర్పాటు చేయవలసినదిగా ఎమ్మెల్యేని కోరడం జరిగినది. పై సమస్యల పట్ల ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారు. అనంతరం పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ చైర్మన్ పూజారి రత్నకుమారి ప్రధానోపాధ్యాయులు బెక్కంటి శ్రీనివాసరావు పాఠశాలకు విచ్చేసిన భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకటరావు ను మరియు ఐటిడిఏ ప్రాజెక్టు ఆఫీసర్ రాహుల్లకు పుష్ప గుచ్చాలు అందించి ఘనంగా శాలువాలతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో పాఠశాలలోని ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు మరియు గ్రామస్తులు పాల్గొనడం జరిగినది.







## బీర్కూర్‌లో ఘనంగా ఏకలవ్య జయంతి వేడుకలు

**బాన్సువాడ, జూలై 25(డిడి9 వార్త):**

ఏకలవ్య జయంతి సందర్భంగా బీర్కూర్ గ్రామ పంచాయతీ ఆవరణలో శనివారం ఘనంగా నివాళులర్పించారు.ఏకలవ్య చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన అనంతరం జై ఏకలవ్య.. జై జై ఏకలవ్య అంటూ నినాదాలు చేశారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, ఏకలవ్య ఆదివాసీ, గిరిజన సమాజానికి ఆదర్శప్రాయుడని, గురుభక్తి, అంకితభావం, పట్టుదలకు ఆయన ప్రతీకగా నిలిచారని పేర్కొన్నారు.యువత ఏకలవ్య జీవితాన్ని ఆదర్శంగా తీసుకొని విద్య, క్రీడలు, అన్ని రంగాల్లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ ప్రెసిడెంట్ యామ రాములు, ఉపసర్పంచ్ పరమేష్, యువజన నాయకులు మియాపురం శశికాంత్, ఆత్మ కమిటీ సభ్యులు శంకర్, నాయకులు బస్వరాజ్ పటేల్, మాజీ సర్పంచ్ సానెపు గంగారాం, మేకల విట్టల్, పృథ్వి గౌడ్, విజయ్, ఎరుకల సంఘ సభ్యులు, గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.తిమ్మాపూర్ తెలంగాణ తిరుమలలో తొలి ఏకాదశి వైభవం..

భక్తులతో కలిసి స్వామివారిని దర్శించుకున్న ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి..

**రూ.70 లక్షల అభివృద్ధి పనులకు భూమిపూజ**

బాన్సువాడ, జూలై 25(డిడి9 వార్త): ఆషాఢ మాసం తొలి ఏకాదశి సందర్భంగా బీర్కూర్ మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో ఉన్న తెలంగాణ తిరుమల దేవస్థానం భక్తజన సందోహంతో కళకళలాడింది.ఈ పవిత్ర సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ వ్యవసాయ సలహాదారులు, బాన్సువాడ నియోజకవర్గ శాసనసభ్యులు పోచారం శ్రీనివాస రెడ్డి ఆలయానికి విచ్చేసి శ్రీ వెంకటేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డికి తీర్థ ప్రసాదాలు అందించి వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో జరిగిన తొలి ఏకాదశి ప్రత్యేక ఉత్సవాల్లో పాల్గొన్న పోచారం శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ, తెలంగాణ తిరుమల దేవస్థానం రాష్ట్రవ్యాప్తంగా భక్తుల విశ్వాసాన్ని చూరగొంటున్న పుణ్యక్షేత్రమని అన్నారు.ప్రతి ఏటా వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకునేందుకు వస్తుండటంతో ఆలయ అభివృద్ధి, భక్తులకు మెరుగైన సౌకర్యాల కల్పనపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో మంచి వర్షాలు కురిసి రైతులు పంటలతో సుభిక్షంగా ఉండాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో జీవించాలని స్వామి వారిని ప్రార్థించినట్లు పేర్కొన్నారు.అనంతరం ఆలయ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా కొండ కింద నుంచి పై వరకు కాలినడకన వచ్చే భక్తుల సౌకర్యార్థం రూ.20 లక్షల వ్యయంతో మెట్ల మార్గం నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు.ఈ మెట్ల మార్గం నిర్మాణం పూర్తయితే చిన్నారులు, మహిళలు, వృద్ధులు సైతం ఎలాంటి



ఇబ్బందులు లేకుండా స్వామివారిని దర్శించుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.అదే విధంగా వర్షాకాలంలో మట్టి జారిపోకుండా, కొండ ప్రాంతాన్ని రక్షించడంతో పాటు భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని రూ.50 లక్షల వ్యయంతో లైనింగ్ వాల్ నిర్మాణ పనులకు కూడా భూమిపూజ చేశారు. ఈ రెండు అభివృద్ధి పనులకు మొత్తం రూ.70 లక్షలు మంజూరవడం ఆలయ అభివృద్ధిలో కీలక మైలురాయిగా నిలుస్తుందని స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.
ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు మాట్లాడుతూ, తెలంగాణ తిరుమల దేవస్థానానికి రోజు రోజుకు భక్తుల సంఖ్య పెరుగుతోందని, భక్తుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతుల విస్తరణ అత్యంత అవసరమైందని తెలిపారు. ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస రెడ్డి ప్రత్యేక చొరవతో మెట్ల మార్గం, లైనింగ్ వాల్ నిర్మాణ పనులు ప్రారంభం కావడం పట్ల ఆయనకు కృతజ్ఞతలు తెలిపారు.
ఈ కార్యక్రమంలో బాన్సువాడ ఆర్డీఓ రవీందర్ రెడ్డి, టౌన్ సీఐ తుల శ్రీధర్, రూరల్ సీఐ తిరుపయ్య, తిమ్మాపూర్ సర్పంచ్ భోగవల్లి అప్పారావు, బీర్కూర్ తండా సర్పంచ్ దేవీసింగ్, ఆలయ కమిటీ సభ్యులు మద్దినేని నాగేశ్వర్ రావు,నాయకులు కూనీపురం రాజిరెడ్డి, సత్యనారాయణ, సాయిబాబా, బీర్కూర్, వర్ని మండలాల ప్రజా ప్రతినిధులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు, భక్తులు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులందరూ గోవింద నామస్మరణతో ఆలయ ప్రాంగణాన్ని ఆధ్యాత్మిక వాతావరణంతో నింపగా, తొలి ఏకాదశి వేడుకలు అత్యంత వైభవంగా, భక్తిశ్రద్ధలతో జరిగాయి.

## బోధన్‌లో వామపక్షాల సంబరాలు..

- **కేంద్ర మంత్రి రాజీనామా చారిత్రాత్మక విజయం**

**బోధన్, నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**



కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడాన్ని హర్షిస్తూ శనివారం బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో శనివారం టపాకాయలు కాల్చి ఘనంగా సంబరాలు నిర్వహించారు. ఢిల్లీలోని జంతర్ మంతర్ వేదికగా సాగిన పోరాటం అత్యంత చారిత్రాత్మకమని, ఇది దేశ విద్యార్థి, యువజన లోకానికి దక్కిన గొప్ప విజయమని నాయకులు కొనియాడారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్రంలోని మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజాస్వామ్య పద్ధతులకు కట్టుబడి ఉండాలని, రాజ్యాంగాన్ని గౌరవించాలని డిమాండ్ చేశారు. కార్పొరేట్ అనుకూల విధానాలను విడనాడి, దేశ ప్రజలకు, కార్మికులకు, విద్యార్థి యువతకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని స్పష్టం చేశారు. లేని పక్షంలో తీవ్ర ప్రజా ఆగ్రహాన్ని ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ ప్రజాపంథా బోధన్ డివిజన్ సహాయ కార్యదర్శి బి.మల్లేష్, సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ నాయకులు పి.వర్ధయ్య, సీపీఐ (ఎం) నాయకులు జె. శంకర్ గౌడ్, ఎంసీపీఐ (యూ) నాయకులు మోసిన్‌తో పాటు డి. నాగేశ్వర్, టి. గంగారాం, షేక్ కాజా, షేక్ నిజాం, హనుమాన్లు, శ్రీను, కృష్ణ, రాజు, బాలరాజు, శ్రీనివాస్, సాయి, సల్మాన్, హైమద్, మహమ్మద్ రఫీ, హబీబ్, శివకుమార్, ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న.బోథ్ మాజీ ఎమ్మెల్యే. రాథోడ్ బాపురావు.

**ఆదిలాబాద్ జిల్లా తలమడుగు మండలం( DD9 వార్త).**

తలమడుగు మండలంలోని. బరంపూర్ కొండపై వెలిసిన. శ్రీ వెంకటేశ్వర స్వామిని దర్శించుకుని. ప్రత్యేక పూజలు చేశారు. రాథోడ్ బాపురావుకు. ఆలయ కమిటీ సభ్యులు. ఘన స్వాగతం పలికారు ఆలయ అర్చకులు వేద మంత్రోచ్చరణాల మధ్య స్వామివారికి రుద్రాభిషేకం నిర్వహించి. తీర్థ ప్రసాదాలు అందజేసి ఆలయ కమిటీ సభ్యులు శాలువతో సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో. రాథోడ్ బాపూరావు మాట్లాడుతూ. ఆషాడ మాసం తొలి ఏకాదశి సందర్భంగా. స్వామి వారిని దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని.. బరంపూర్ కొండపై వెలసిన వెంకటేశ్వర స్వామి. భక్తుల కోరికల. కొంగు బంగారం చేసే పుణ్యక్షేత్రమని అన్నారు. వర్షాలు బాగా కురిసి పాడి పంటలు సమృద్ధిగా పండాలని. స్వామి వారిని వేడుకున్నట్లు. ఆయన తెలిపారు. ఆయన వెంట. TRS పార్టీ. మండల నాయకులు. నిమ్మల గజానన్. గడుగు పోచ్చన్న. దేవల స్వామి శ్రీనివాస్. రమేష్. గడుగు శ్రీనివాస్ . శాస్త్రి. తదితరులు పాల్గొన్నారు



## కేటీపీపీ ఆర్టిజన్ కార్మికుడు దుగ్యాల శ్రీకాంత్ రావు మృతి

- **అంత్యక్రియలలో పాల్గొన్న ఏఐటియుసి హెచ్ 64 నాయకత్వం**
- **శ్రీకాంత్ రావు మృతదేహానికి నివాళులు అర్పించిన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఓదెలు**
- **రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంట మహేందర్**

**ములుగు, జులై 25, డీ డీ 9 వార్త :**



కేటీపీపీ ఆర్టిజన్ కార్మికుడు దుగ్యాల శ్రీకాంత్ రావు శుక్రవారం రాత్రి మరణించాడు. కేటీపిపి ఆర్టిజన్ కార్మికుడు కీ శే కామ్రేడ్ దుగ్యాల శ్రీకాంత్ రావు బౌతికకాయాని కి వారి స్వగృహం మల్లంపల్లి(ఏసు నగర్ ) నందు ఏఐటీయూసీ హెచ్ 64 నాయకత్వం లో, ఘనంగా నివాళులు అర్పించి అంతిమయాత్ర లో పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమం లో ఏఐటీయూసీ హెచ్64 రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అల్లం ఓదెలు, రాష్ట్ర ఉపాధ్యక్షులు కుంట మహేందర్,రీజినల్ ప్రెసిడెంట్ కోల శ్యామ్, ప్రధాన కార్యదర్శి గోపిరెడ్డి కిరణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా ఈ సందర్భాన్ని పురస్కరించుకొని నాయకులు కామ్రేడ్ దుగ్యాల శ్రీకాంత్ రావ్ జోహార్ జోహార్ అని నినాదాలు చేశారు.

## బీఆర్ఎస్ శ్రేణులు అప్రమత్తంగా ఉండాలి: వీజీ గౌడ్

- **బోధన్‌లో నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం**
- **ఓటరు నమోదు, పార్టీ పటిష్టతపై నేతల దిశానిర్దేశం**

**బోధన్, నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**



కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపడుతున్న ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలని మాజీ ఎమ్మెల్సీ వీజీ గౌడ్ పిలుపునిచ్చారు. బోధన్ పట్టణంలోని మాజీ ఎమ్మెల్యే షకీల్ ఆమెర్ నివాసంలో బీఆర్ఎస్ నాయకురాలు అయేషా ఫాతిమా ఆమెర్ అధ్యక్షతన శనివారం నియోజకవర్గ స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జడ్పీ మాజీ చైర్మన్ దాదన్నగారి విఠల్ రావుతో కలిసి ముఖ్య అతిథిగా విచ్చేసిన వీజీ గౌడ్.. పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ నమోదు ప్రక్రియను ప్రతి గ్రామంలో వేగవంతం చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరి ఓటు నమోదు పూర్తయ్యేలా ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, వాటి పరిష్కారానికి కృషి చేయడంతో పాటు గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ సంస్థాగత బలోపేతం, సభ్యత్వ నమోదు, ప్రజా సమస్యలపై రాబోయే రోజుల్లో చేపట్టాల్సిన కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణపై విస్తృతంగా చర్చించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోఆర్డినేటర్ సుమిత్ర, బీఆర్ఎస్ పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు రవీందర్ యాదవ్, సంజీవ్ కుమార్, నర్సన్న, శ్రీరామ్, భూమారెడ్డి, నర్సింగ్ రావు, కౌన్సిలర్లు ముషీర్ బాబా, మోబీన్, అజార్, లక్ష్మి, తదితర పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# మణుగూరు పట్టణంలో పలు అభివృద్ధి పనులకు భూమిపూజ కార్యక్రమాలను నిర్వహించిన ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.

- **విద్యార్థులకు మెరుగైన విద్యతో పాటు, నాణ్యమైన మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ లక్ష్యమన్న పాయం.**

**మణుగూరు.జూలై 25 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు మండలం లోని డీఎస్పీ కార్యాలయం ఎదురుగా ఉన్న గిరిజన ఆశ్రమ పాఠశాలలో రూ.25 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న గ్రౌండ్ లెవెలింగ్ మరియు ఆర్ఓ ప్లాంట్ నిర్మాణ పనులకు పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు శనివారం నాడు భూమిపూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ,పాఠశాలల్లో పరిశుభ్రమైన త్రాగునీటి సౌకర్యం,మెరుగైన ప్రాంగణం,విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతుందని తెలిపారు. అనంతరం సమితిసింగారం గ్రామపంచాయతీ పరిధిలోని అశోక్ నగర్ లో రూ.10 లక్షల రూపాయల వ్యయంతో నిర్మించనున్న PMH హాస్టల్ ప్రహరీ గోడ నిర్మాణ పనులకు ఎమ్మెల్యే పాయం భూమిపూజ నిర్వహించి పనులను ప్రారంభించారు.అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, విద్యా సంస్థలలో మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. తరువాత ఇదే గ్రామపంచాయతీ పరిధిలోని విద్యానగర్ కాలనీలో రూ.5 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న సిసి రోడ్డు నిర్మాణ పనులకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన రహదారి సౌకర్యాలు కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కాలనీల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమాలలో సంబంధిత శాఖల అధికారులు, మండల మరియు పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు,సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మహిళా సంఘం నేతలు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.





# ప్రభుత్వ పథకాల అమలులో వేగం పెంచాలి.. నిర్లక్ష్యం వహిస్తే ఉపేక్షించేది లేదు..

- **అధికారులందరూ ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలి..**
- **అన్ని శాఖల అధికారుల సమీక్షా సమావేశంలో -- పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు.**

**మణుగూరు.జూలై 25(డి డి 9వార్త)**

ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో వేగవంతంగా అమలు చేయాలని, ప్రతి అధికారి ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. శనివారం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులోని క్యాంపు కార్యాలయంలో మండల స్థాయి అన్ని శాఖల అధికారులతో ఆయన సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. సుమారు రెండు గంటలకు పైగా సాగిన ఈ సమావేశంలో ప్రజా సమస్యల పరిష్కారం, శాఖల మధ్య సమన్వయం, మెరుగైన సేవలందించే దిశగా ఆయన అధికారులకు కీలక దిశానిర్దేశం చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రథమ ప్రాధాన్యం అని ఆయన అన్నారు.

రెవెన్యూ, పంచాయతీరాజ్, ఎంపీడీవో అధికారుల పనితీరుపై సమీక్షించిన ఎమ్మెల్యే.. ప్రజల నుంచి వచ్చే భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని, పెండింగ్ దరఖాస్తులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని ఆదేశించారు. గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీలు, వీధి దీపాల ఏర్పాటును క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. ఉపాధి హామీ పనులను వేగవంతం చేయడంతో పాటు గ్రామాభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని సూచించారు. రేషన్ సరుకుల పంపిణీలో ఎలాంటి అవకతవకలకు తావులేకుండా లబ్ధిదారులకు సకాలంలో అందేలా పౌర సరఫరాల శాఖ పారదర్శకంగా వ్యవహరించాలని ఆదేశించారు. రైతులకు అండగా నిలవాలి అని, ప్రత్యామ్నాయ సాగుపై అవగాహన కల్పించాలని సూచించారు.వ్యవసాయ, ఉద్యానవన, నీటిపారుదల శాఖల అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తక్కువ వర్షపాతం నమోదవుతున్న ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా రైతులకు ప్రత్యామ్నాయ పంటలపై అవగాహన కల్పించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉంచడంతో పాటు, డ్రిప్, స్ప్రింక్లర్ తదితర ఆధునిక సాగు విధానాలను ప్రోత్సహించాలన్నారు. చెరువులు, కాలువల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించి, సాగునీటి పంపిణీ సక్రమంగా జరిగేలా చూడాలని ఇరిగేషన్ అధికారులకు సూచించారు. వ్యవసాయానికి అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని, ట్రాన్స్‌ఫార్మర్లు, లైన్ల మరమ్మతులను తక్షణమే పూర్తి చేయాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. పశువులకు ఉచిత వైద్య శిబిరాలు, మత్స్యకారులకు ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకోవాలని, అలాగే అటవీ సంపదను కాపాడుతూ అక్రమ కలప రవాణాను అరికట్టాలని అటవీ శాఖ అధికారులను అప్రమత్తం చేశారు.

విద్య, వైద్యం, తాగునీటి సరఫరాలో రాజీపడొద్దు. మౌలిక సదుపాయాలు, విద్య, వైద్య రంగాలపై ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు. మిషన్ భగీరథ, ఆర్డబ్ల్యూఎస్ (RWS) ద్వారా ప్రతి గ్రామానికి నిరంతర తాగునీరు అందించాలని, పైప్‌లైన్ లీకేజీలు ఉంటే వెంటనే సరిచేయాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచి, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా వ్యవహరించడంతో పాటు గ్రామాల్లో ఆరోగ్య శిబిరాలు నిర్వహించాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని, విద్యార్థుల హాజరు, మధ్యాహ్న భోజనం నాణ్యతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల ద్వారా గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు పౌష్టికాహారం సక్రమంగా చేరాలని ఐసీడీఎస్ అధికారులకు సూచించారు.

'ఎస్ఐఆర్' నమోదును వేగవంతం చేయాలి.

ఇదే క్రమంలో మండలంలో అమలవుతున్న 'ఎస్ఐఆర్' (SIR) నమోదు ప్రక్రియ పురోగతిని ఎమ్మెల్యే ప్రత్యేకంగా ఆరా తీశారు. ఈ నమోదు ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో సాధించాలని అధికారులను ఆదేశించారు.

ప్రభుత్వ లక్ష్యాల సాధనలో ఏ ఒక్క శాఖ నిర్లక్ష్యం వహించినా ఉపేక్షించేది లేదని, అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగి ప్రజలకు మెరుగైన, వేగవంతమైన సేవలు అందించాలని ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ఉద్ఘాటించారు. ఈ సమావేశంలో తహసీల్దార్, ఎంపీడీవోతో పాటు సింగరేణి సమన్వయ అధికారులు, తదితర అన్ని ప్రభుత్వ శాఖల మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.






# సింగరేణి సహకారంతో నాలుగు కూడళ్లలో హైమాస్ట్ లైట్లు

- **సర్పంచ్ వినతికి స్పందించిన జీఎం**
- **లైట్లు ఏర్పాటు చేయడంతో కృతజ్ఞతలు తెలిపిన పల్లె ప్రతిమాపివీరావు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 25 (డీడీ9 వార్త):**

సెంటినరీకాలనీలోని సి2 క్వార్టర్ల పరిధిలో నాలుగు ప్రధాన కూడళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు ప్రారంభమైంది. పాత ఆంధ్రాబ్యాంక్ చౌరస్తా, నర్సరీ చౌరస్తా, సి2 చివరి క్వార్టర్లలోని రెండు కూడళ్లలో లైట్లు ఏర్పాటు చేయాలని రత్నాపూర్ సర్పంచ్ పల్లె ప్రతిమాపివీరావు గతంలో సింగరేణి జీఎం సుంకర మధుసూదన్కు వినతిపత్రం సమర్పించారు.

జీఎం ఆదేశాలతో ఆర్జీ2 వర్క్‌షాప్ ఇన్‌చార్జి ఎర్రం వెంకటరామిరెడ్డి లైట్లను అందించగా, సెంటినరీకాలనీ ఎలక్ట్రికల్ సూపర్‌వైజర్ సంపత్ ఆధ్వర్యంలో స్తంభాలను ఏర్పాటు చేశారు. సింగరేణి యాజమాన్యం స్పందించి లైట్లు ఏర్పాటు చేసినందుకు సర్పంచ్ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాద్రపు ప్రవళిక-ప్రశాంత్, వార్డు సభ్యులు బత్తుల రాజమణి-రమేష్, జుట్టు యశోద, బత్తిని ప్రశాంత్, పున్నం మణితేజ, అల్లి రమేష్, కార్యదర్శి గంగుల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.



# ఆర్జీ-1 ఏరియా పర్సనల్ మేనేజర్ ముప్పిడి రవీందర్ రెడ్డికి ఘన సన్మానం

- **పదవీ విరమణ సందర్భంగా అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధుల అభినందనలు – సేవలను కొనియాడిన వక్తలు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 25 (డీడీ9 వార్త):**

రామగుండం ఏరియా-1 పర్సనల్ విభాగంలో పర్సనల్ మేనేజర్గా సేవలందించి ఈ నెల పదవీ విరమణ పొందుతున్న ముప్పిడి రవీందర్ రెడ్డిని శనివారం అధికారులు, ఉద్యోగులు, కార్మిక సంఘాల ప్రతినిధులు ఘనంగా సన్మానించారు. జీడీకే-2, 2ఎ గని అధికారులు, ఉద్యోగులు, కార్మికులు శాలువాతో సత్కరించి ఆయన సేవలను కొనియాడారు.

సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్షుడు రామచంద్రరావు శాలువా కప్పి, జ్ఞాపిక అందజేసి సత్కరించారు. ఉద్యోగుల సంక్షేమం, కార్మిక-యాజమాన్య సంబంధాల మెరుగుదల, సేవా నియమాల అమలు, సమస్యల పరిష్కారంలో రవీందర్ రెడ్డి సమర్థవంతంగా పనిచేశారని వక్తలు పేర్కొన్నారు.

నిబద్ధత, క్రమశిక్షణ, పారదర్శకతతో విధులు నిర్వర్తించి సహోద్యోగులకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. పదవీ విరమణ అనంతరం ఆయురారోగ్యాలతో ఆనందంగా జీవించాలని ఆకాంక్షించారు.

తనకు అందించిన గౌరవానికి రవీందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో జీడీకే-2, 2ఎ స్టాట్యూటరీ మేనేజర్ డి. రమేష్ బాబు, మైన్ మేనేజర్ ఎజ్జగిరి శివయ్య, వెల్ఫేర్ ఆఫీసర్ డి. గణేష్, సేఫ్టీ ఆఫీసర్ దొంత వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు, సిబ్బంది, కార్మికులు, కార్మిక సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.





## కొత్తగూడెంలో జరిగే కాంగ్రెస్ ఎస్సీ సెల్ ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి. దేపంగి వెంకటరమణ.

**మణుగూరు. జూలై 25 (డి డి 9వార్త)**

కొత్తగూడెం క్లబ్‌లో నేడు (ఆదివారం) జరగనున్న కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా కమిటీ, మండల కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ జిల్లా జనరల్ సెక్రటరీ దేపంగి వెంకటరమణ పిలుపునిచ్చారు. అశ్వాపురం మండలం మల్లెలమడుగు గ్రామంలో ఆయన మాట్లాడుతూ, ఎస్సీ సెల్ జిల్లా చైర్మన్ గద్దల రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కార్యక్రమానికి జిల్లా, మండల స్థాయి ఎస్సీ సెల్ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్సీ సెల్ రాష్ట్ర చైర్మన్, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఎస్సీ సెల్ నాయకులు నందిపాటి ప్రశాంత్, గొడ్ల సురేష్, కొప్పుల నరసింహారావు, మచ్చ నాగేశ్వరరావు, నందిపాటి వెంకన్న, ఇస్సంపల్లి లక్ష్మణ్, నంద్రు వెంకటి తదితరులు పాల్గొన్నారు.

## SIR ప్రక్రియలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి..

- **పార్టీ శ్రేణులకు రేగా సూచన.**

**మణుగూరు.జూలై 25 (డి డి 9వార్త)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, మణుగూరు లోని బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నాడు నిర్వహించిన ముఖ్య నాయకుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, పినపాక నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ చివరి దశలో ఉన్నందున మండలంలోని 68 బూత్ లలో అర్హుడైనా ప్రతి ఒక్కరి ఓటు నమోదు చేసేలా పార్టీ శ్రేణులు పనిచేయాలని సూచించారు. ఇప్పుడు ఏమాత్రం అశ్రద్ధ చేసినా మరల ఓటుహక్కు పొందాలంటే చాలా ప్రాసెస్ ఉంటుందని, అలాగే కాలయాపన కూడా అవుతుందని అన్నారు.ఎక్కడైతే ఎస్ఐఆర్ ప్రక్రియ నిదానంగా సాగుతుందో ఆయా బూత్ లను గుర్తించి వాటిపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన సూచించారు.

ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ కుర్రి నాగేశ్వరరావు, మాజీ జెడ్పిటిసి పోశం నరసింహారావు, ముత్యంబాబు, వట్టం రాంబాబు, నూకారపు రమేష్, ఎడ్ల శ్రీనివాస్, ఆడప అప్పారావు, యాదగిరి గౌడ్, ఆవుల నరసింహారావు, అక్కి నరసింహారావు, జావిద్ భాష తదితరులు పాల్గొన్నారు.




## వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ పనితీరును పరిశీలన

- **రైతు డిస్కం,రెడ్‌కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖి**

**బోనకల్,జూలై 25,(డీడీ9 వార్త):**

మండలంలోని గార్లపాడు గ్రామంలో వ్యవసాయ క్షేత్రంలో ఏర్పాటు చేసిన సోలార్ పంప్ సెట్ పనితీరును శనివారం రైతు డిస్కం , రెడ్‌కో వైస్ చైర్మన్,ఎండీ ముషారఫ్ ఫరూఖి,జిల్లా కలెక్టర్ దివాకర,టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి లు పరిశీలించారు.నేరుగా రైతుతో మాట్లాడుతూ పనితీరును తెలుసుకొని సోలార్ పంప్ సెట్ వలన కలిగే లాభాలను వివరించారు. ఏమన్నా ఇబ్బందులు ఉన్నాయా అడిగి తెలుసుకున్నారు. రైతు మాట్లాడుతూ చాలా సంతోషంగా ఉందని వ్యక్తం చేస్తూ అనంతరం రావినూతల గ్రామంలో ఇంటిపై ఏర్పాటు చేస్తున్న రూఫ్‌టాప్ సోలార్ ఫ్లాంట్ పనితీరును నేరుగా లబ్ధిదారుని తో మాట్లాడి ఉచిత విద్యుత్ తో పాటు అదనపు ఆదాయం సమకూరుతుందని రాష్ట్ర ప్రభుత్వం వలన చాలా సంతోషముగా ఉన్నామని చెప్పారు .ఈ కార్యక్రమంలో రెడ్కో ఉన్నతాధికారులు,ఖమ్మం సూపరింటెండింగ్ ఇంజనీర్ శ్రీనివాస చారి, స్థానిక ప్రజా ప్రతినిధులు,రైతులు తదితరులు పాల్గొన్నారు.



## కూనంనేనిని కలిసిన సీపీఐ–ఏఐటీయూసీ నాయకులు

- **గోదావరిఖనిలో కార్మికుల కవాతుకు హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావుకు పుష్పగుచ్ఛం అందజేసిన నాయకులు**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 25 (డీడీ9 వార్త):**

సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఆర్‌జీ1 బ్రాంచ్ కమిటీ ఆధ్వర్యంలో గోదావరిఖనిలో నిర్వహించిన కవాతులో పాల్గొనేందుకు విచ్చేసిన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కామ్రేడ్ కూనంనేని సాంబశివరావును సీపీఐ-ఏఐటీయూసీ రామగుండం నగర సమితి నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

కార్యక్రమంలో ఏఐటీయూసీ రామగుండం నగర అధ్యక్షులు అబ్దుల్ కరీం, ప్రధాన కార్యదర్శి శనిగరపు చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.






## విద్యార్థుల ఉద్యమానికి అండగా నిలబడదాం: సీఐటీయూ–డీవైఎఫ్ఐ

- **నీట్ పేపర్ లీకేజీపై కేంద్రాన్ని నిలదీస్తూ గోదావరిఖనిలో టార్చ్‌లైట్ ర్యాలీ**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 25 (డీడీ9 వార్త):**

నీట్ పరీక్ష పత్రాల లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ ఢిల్లీలో విద్యార్థులు, యువత చేస్తున్న ఉద్యమానికి మద్దతుగా సీఐటీయూ, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖని ప్రధాన చౌరస్తాలో టార్చ్‌లైట్ ర్యాలీ నిర్వహించారు.

ఈ సందర్భంగా సీఐటీయూ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి ఏ. ముత్యంరావు, డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కొంటు సాగర్ మాట్లాడుతూ, నీట్ పేపర్ లీకేజీపై విద్యార్థులు, యువత దేశవ్యాప్తంగా ఆందోళన చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. ఢిల్లీలో శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై పోలీసుల లాఠీచార్జిని తీవ్రంగా ఖండించారు.

నీట్ పేపర్ లీకేజీ కారణంగా నష్టపోయిన విద్యార్థుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం ఇవ్వాలని, ఎన్‌టీఏను రద్దు చేసి నీట్ పరీక్ష నిర్వహణ బాధ్యతను రాష్ట్రాలకు అప్పగించాలని, విద్యార్థులపై దాడి చేసిన పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ధర్మేంద్ర ప్రధాన్‌ను వెంటనే పదవి నుంచి తొలగించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ నాయకులు చంద్రగిరి కృష్ణకుమార్, వీర సూర్య, సీఐటీయూ రాష్ట్ర నాయకులు తుమ్మల రాజారెడ్డి, జిల్లా నాయకులు కుమారస్వామి, మెండె శ్రీను, రామాచారి, బిక్షపతి, లక్ష్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు

## కొత్త చరిత్ర కాదు.. సింగరేణిలో ఏఐటీయూసీది రక్తతర్పణ చరిత్ర

- **సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తే సహించం**
- **హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలి: ఏఐటీయూసీ**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 25 (డీడీ9 వార్త):**

సింగరేణిలో ఏఐటీయూసీది కొత్త చరిత్ర కాదని, ఎనిమిది దశాబ్దాలకు పైగా కార్మికుల హక్కుల కోసం పోరాడిన రక్తతర్పణ చరిత్ర అని స ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మడ్డి ఎల్లాగౌడ్, కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి అన్నారు.

ఆర్జీ1 ఏరియాలోని జీడీకే1 సీఎచ్‌పీలో శనివారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడుతూ..., సోషల్ మీడియాలో ఏఐటీయూసీ, ఆ సంఘం నాయకులపై హెచ్ఎంఎస్ యూనియన్ అభ్యంతరకర పోస్టులు పెట్టడం కార్మిక వ్యతిరేక చర్యగా అభివర్ణించారు. సింగరేణి పరిరక్షణ, కార్మికుల హక్కుల కోసం ఏఐటీయూసీ అనేక పోరాటాలు నిర్వహించిందని, పలువురు నాయకులు బలిదానాలు చేశారని గుర్తుచేశారు. సోషల్ మీడియాలో కార్మికులను తప్పుదోవ పట్టించేలా పోస్టులు పెట్టిన హెచ్ఎంఎస్ యూనియన్ కార్మికులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో కార్మికులే తగిన సమాధానం చెబుతారని హెచ్చరించారు. ఏఐటీయూసీ ఎల్లప్పుడూ కార్మికుల హక్కులు, సంస్థ అభివృద్ధి కోసం పోరాడుతుందని, వ్యక్తిగత దుష్ప్రచారాలను తిప్పికొడతామని స్పష్టం చేశారు. ఏఐటీయూసీ సీఎచ్‌పీ డిపార్‌ట్‌మెంట్ కార్యదర్శి బండి మల్లేష్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు సంకె అశోక్, బోగ సతీష్‌బాబు, గండి ప్రసాద్, పెర్క మహేందర్, మానాల శ్రీనివాస్, కారంపూరి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



## రూ. 50 లక్షలు విలువైన గంజాయి పట్టివేత

- **ఒక కారు, ఐదు సెల్ ఫోన్లతో పాటు నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న ఎక్సైజ్ శాఖ**

**భద్రాచలం, జూలై 25 (డిడి9 వార్త)**

జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారులు శనివారం భారీగా గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. భద్రాచలంకూనవరం ప్రధాన రహదారిపై నిర్వహించిన వాహన తనిఖీల్లో సుమారు క్వింటా ఒక కిలో గంజాయిని తరలిస్తున్న ముఠాను పట్టుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. భద్రాచలం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ సోమిరెడ్డి మాట్లాడుతూ భద్రాచలంలోని కూనవరం రోడ్డులో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ రహీమున్నీసా బేగం ఆధ్వర్యంలో అధికారులు వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వెళ్తున్న మారుతి సుజుకి ఎర్టిగా కారును ఆపి తనిఖీ చేయగా అందులో సుమారు క్వింటా ఒక కిలో (101 కిలోలు) గంజాయిని గుర్తించారు. ఈ గంజాయిని మోతుగూడెం ప్రాంతం నుంచి కర్ణాటకలోని బెంగళూరుకు అక్రమంగా తరలిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. ఈ కేసులో కర్ణాటక రాష్ట్రానికి చెందిన సలీం పాషా, ఎం.డి. అరబాద్ హుస్సేన్, ఎస్. గుల్జార్తో పాటు ఆంధ్రప్రదేశ్‌లోని అనంతపురం జిల్లాకు చెందిన రాజేంద్రప్రసాద్‌ను అదుపులోకి తీసుకున్నారు. నిందితుల నుంచి గంజాయితో పాటు మారుతి సుజుకి ఎర్టిగా కారు, ఐదు సెల్ ఫోన్లను అధికారులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి పూర్తి స్థాయి దర్యాప్తు చేస్తున్నామని సోమిరెడ్డి తెలిపారు.



# సౌర వనరులు అపరిమితం వాటిని సద్వినియోగం చేసుకుందాం

- **సౌర వనరులు అపరిమితం వాటిని సద్వినియోగం చేసుకుందాం**
- **రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖి**
- **సోలార్ రూఫ్‌టాప్, సోలార్ పంప్‌సెట్ల వినియోగదారులతో అధికారుల ముఖాముఖి**

**బోనకల్,జూలై 25,(డీడీ9 వార్త):**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశంతో తెలంగాణ సోలార్ తెలంగాణగా వెలుగుతుందని రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖి తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 81 మోడల్ సోలార్ విలేజ్‌ల కార్యక్రమంలో భాగంగా బోనకల్ మండలాన్ని ఆదర్శ మోడల్ సోలార్ మండలంగా తీర్చిదిద్దేందుకు చేపడుతున్న పనులను రెడ్కో వైస్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ముషారఫ్ ఫరూఖి,టీజీఎన్‌పీడీసీఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ కర్ణాటి వరుణ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.శనివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు.

బోనకల్,రావినూతల,గార్లపాడు గ్రామాల్లో కొనసాగుతున్న సోలార్ పనులను వారు పరిశీలించి, పనుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బోనకల్ మండలంలోని రైతు వేదికలో నిర్వహించిన అవగాహన సదస్సులో అన్ని గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా రెడ్కో వైస్ చైర్మన్ ఎండీ ముషారఫ్ ఫరూఖి మాట్లాడుతూ, తెలంగాణలో పునరుత్పాదక ఇంధన వినియోగాన్ని పెంచి, మోడల్ సోలార్ గ్రామాలను దేశానికే ఆదర్శంగా నిలిపే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు.

సౌర వనరులు అపరిమితం వాటిని సద్వినియోగం చేసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని ఆయన అన్నారు. విద్యుత్ నిత్యావసరంగా మారిన నేపథ్యంలో రోజురోజుకూ విద్యుత్ డిమాండ్ పెరుగుతోందని, ప్రస్తుతం విద్యుత్ ఉత్పత్తిలో ప్రధానంగా వినియోగిస్తున్న బొగ్గు వనరులు పరిమితమైనవని తెలిపారు. బొగ్గు వినియోగాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు గ్రీన్ ఎనర్జీ వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు.

ఇళ్లపై, వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసుకోవడం ద్వారా వినియోగదారులు తమ వంతుగా సౌర విద్యుత్ ఉత్పత్తికి సహకరించాలని ఆయన సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సుమారు ₹1,000 కోట్ల వ్యయంతో 81 గ్రామాలను మోడల్ సోలార్ గ్రామాలుగా అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క దిశానిర్దేశంతో తెలంగాణను సోలార్ తెలంగాణగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ఇప్పటికే కొండారెడ్డిపల్లి గ్రామాన్ని పూర్తిస్థాయిలో సోలార్ గ్రామంగా అభివృద్ధి చేశామని తెలిపారు.

సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థల ద్వారా కుటుంబాలు తమ విద్యుత్ అవసరాలను తీర్చుకోవడంతో పాటు అదనపు విద్యుత్‌ను గ్రిడ్‌కు అందించి ఆర్థిక ప్రయోజనం పొందే అవకాశం ఉందన్నారు. ప్రతి ఇంట్లో సోలార్ విద్యుత్ వినియోగాన్ని పెంచేందుకు ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు.

ఆగస్టు 15 నాటికి బోనకల్ మండలంలోని అన్ని మోడల్ సోలార్ పనులను పూర్తి చేసి ప్రజలకు అంకితం చేసేలా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని, సాంకేతికంగా లేదా పరిపాలనాపరంగా ఎలాంటి సమస్యలు ఎదురైనా వెంటనే పరిష్కరించి పనుల్లో వేగం పెంచాలని సూచించారు.

**విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ₹60 కోట్లు**

టీజీఎన్‌పీడీసీఎల్ సీఎండీ కర్ణాటి వరుణ్ రెడ్డి మాట్లాడుతూ బోనకల్ మండలంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి సుమారు ₹60 కోట్లు వెచ్చిస్తున్నామని తెలిపారు. మండలంలో మూడు కొత్త సబ్‌స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నామని, రావినూతలలో 132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.

సౌర విద్యుత్ ఉత్పత్తి ద్వారా రైతులకు అదనపు ఆదాయం పొందే అవకాశం ఉందని, వ్యవసాయ క్షేత్రాల్లో సోలార్ పంప్‌సెట్ల వినియోగం ద్వారా విద్యుత్ ఖర్చులను తగ్గించుకోవడంతో పాటు రైతులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయని అన్నారు.

గత ఆరు నెలలుగా బోనకల్ మండలంలో మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమం నిరంతరాయంగా కొనసాగుతోందని తెలిపారు. పనుల నాణ్యతలో ఎలాంటి రాజీ పడకుండా, బోనకల్ మండలంలోని మోడల్ సోలార్ గ్రామాలను రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దాలని అధికారులకు సూచించారు. మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమం పూర్తయిన అనంతరం వ్యవసాయ రంగంలో సోలార్ పంప్‌సెట్ల విస్తరణను మరింత వేగవంతం చేస్తామని వరుణ్ రెడ్డి తెలిపారు.

**ప్రతి ఇంటినీ సోలరైజ్ చేయాలి: జిల్లా కలెక్టర్**

ఖమ్మం జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్ మాట్లాడుతూ ప్రతి ఇంటినీ సోలరైజ్ చేయడం ద్వారా పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా స్థానికంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవచ్చని తెలిపారు. సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు దోహదపడుతుందని అన్నారు. మోడల్ సోలార్ గ్రామాల కార్యక్రమంలో గ్రామస్థులు చురుకుగా భాగస్వాములై సోలార్ విద్యుత్ వినియోగాన్ని ప్రోత్సహించాలని ఆయన పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా అధికారులు గ్రామస్థులతో ముఖాముఖి సమావేశం నిర్వహించి మోడల్ సోలార్ గ్రామాల వల్ల కలిగే ప్రయోజనాలు, సోలార్ రూఫ్‌టాప్ వ్యవస్థలు, సోలార్ పంప్‌సెట్ల వినియోగం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. స్వచ్ఛమైన ఇంధన వినియోగాన్ని పెంచడం, విద్యుత్ వ్యయాలను తగ్గించడం, పర్యావరణాన్ని పరిరక్షించడం, రైతులకు నాణ్యమైన విద్యుత్ అందించడం వంటి లక్ష్యాలతో రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తోందని వివరించారు. ఈ కార్యక్రమంలో రెడ్కో, ఎన్పీడీసీఎల్ సిఎండి కే వరుణ్ రెడ్డి, రెడ్కో సిఎండి ముష్రాఫ్ అలీ ఫరూక్, ఖమ్మం జిల్లా కలెక్టర్ టీఎస్ దివాకర్, ఎన్పీడీసీఎల్ సిజిఎం ఆపరేషన్ రాజు చౌహన్, మల్లికార్జున్ ఎస్ సి ఆపరేషన్ ఖమ్మం, ఈ శ్రీనివాసచారి సూపరింటెంట్ ఇంజనీర్ ఖమ్మం, బద్రి పవర్ కన్స్ట్రక్షన్ డిఇ,బండి శ్రీనివాసరావు డివిజనల్ ఇంజనీరింగ్ మధిర, వై.వి ఆనంద్ కుమార్ అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ బోనకల్, రెడ్కో జీఎం,రెడ్కో డిఎం ఖమ్మం , ప్రాజెక్టు అధికారులు, జిల్లా అధికారులు, అమలు సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## దేవాదుల జలాలతో తపాస్‌పల్లికి జీవం

- **ఎట్టకేలకు నెరవేరిన రైతుల సాగునీటి కల**

**జనగామ జులై 25(డిడి 9వార్త ) బ్యూరో**

తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు దేవాదుల ప్రాజెక్టు జలాలు చేరడంతో రైతుల సాగునీటి కల సాకారమైంది. రిజర్వాయర్‌లోకి నీరు చేరడంతో పరిసర ప్రాంతాల రైతుల్లో ఆనందం వెల్లివిరిసింది. వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం ఏర్పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. తపాస్‌పల్లి రిజర్వాయర్‌కు దేవాదుల జలాలు విడుదల చేయాలని జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి శాసనసభలో పలుమార్లు ప్రస్తావించడంతో పాటు సంబంధిత శాఖ అధికారులు, మంత్రులతో సమావేశాల్లోనూ నిరంతరం కోరారు. రైతుల సాగునీటి సమస్య పరిష్కారానికి ఆయన చేసిన కృషి ఫలితంగానే రిజర్వాయర్‌కు జలాలు చేరాయని స్థానిక రైతులు పేర్కొంటున్నారు.




దేవాదుల జలాల రాకతో తపాస్‌పల్లి పరిసర ప్రాంతాల్లో సాగునీటి సమస్యకు ఊరట లభించనుండగా, రానున్న పంటల సాగుపై రైతుల్లో కొత్త ఆశలు చిగురించాయి. ఎమ్మెల్యే చొరవను రైతులు అభినందిస్తున్నారు.

## జనగామకు నవోదయ, కేంద్రీయ విద్యాలయాలపై సానుకూల స్పందన


**జనగామ జూలై 25(డిడి 9వార్త)బ్యూరో**

జనగామ జిల్లాకు నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం మంజూరుకు ప్రభుత్వం సానుకూలంగా స్పందించినట్లు ప్రభుత్వ పాఠశాల విద్యాశాఖ అదనపు కార్యదర్శి సైదా తెలిపారు. శనివారం సచివాలయంలో నాగరత్న సేవా సంఘం అధ్యక్షుడు బిర్రు ఇస్తారి ఆధ్వర్యంలో ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సైదాను సంఘం ప్రతినిధులు శాలువాతో సన్మానించారు.

ఈ సందర్భంగా సైదా మాట్లాడుతూ జనగామ జిల్లాకు నవోదయ విద్యాలయం, కేంద్రీయ విద్యాలయం ఏర్పాటు కోసం కేంద్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు. అలాగే తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్ కూడా త్వరలో ఏర్పాటు చేసే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు.

బిర్రు ఇస్తారి మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలో తెలంగాణ పబ్లిక్ స్కూల్, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ హైస్కూల్‌ను మంజూరు చేయాలని విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. జనగామలో తగిన స్థలం, మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని, విద్యాసంస్థలు ఏర్పాటైతే జిల్లా విద్యా కేంద్రంగా అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు.

అనంతరం పంచాయతీరాజ్ శాఖ ముఖ్య ప్రధాన కార్యదర్శి దానకిశోర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. జనగామ జిల్లాకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్న ఆయన, త్వరలో జనగామ జిల్లాను సందర్శిస్తానని హామీ ఇచ్చినట్లు ఇస్తారి తెలిపారు.





## పరిశుభ్రతలో ప్రజల భాగస్వామ్యం అవసరం: మేయర్ మహంకాళి స్వామి

- **రామ్‌నగర్‌లో తెల్లవారుజామున మేయర్ ఆకస్మిక పర్యటన**
- **కాలువలు, యూజీడీ, రోడ్ల పరిశుభ్రత పనుల పరిశీలన**

**పెద్దపల్లి బ్యూరో, జూలై 25 (డీడీ9 వార్త):**

నగరాన్ని పరిశుభ్రంగా, సుందరంగా తీర్చిదిద్దేందుకు ప్రజలు నగరపాలక సంస్థకు సహకరించాలని రామగుండం నగర మేయర్ మహంకాళి స్వామి కోరారు. శనివారం తెల్లవారుజామున 10వ డివిజన్ రామ్‌నగర్‌లో పర్యటించిన ఆయన 2ఎ ఇంక్‌లైన్ మోరీ వద్ద పూడికతీత, ఖాళీ స్థలాల్లో పిచ్చిమొక్కల తొలగింపు పనులను పరిశీలించారు. రోడ్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను తొలగించి, రామాలయం వెనుక రోడ్డుపై నిలిచిన మురుగునీటిని తొలగించేందుకు యూజీడీని శుభ్రం చేయించారు.

బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా, నెలకు రూ.50 చెల్లించి ఇంటి ముందుకు వచ్చే స్వచ్ఛ ఆటోకు చెత్త అందించాలని మేయర్ సూచించారు. అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), కమిషనర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ... వర్షాకాలంలో అంటువ్యాధుల నివారణకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.

అనంతరం 2, 32, 33, 34, 49వ డివిజన్లలో పర్యటించిన మేయర్ రోడ్లు, కాలువలపై ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలను తొలగించాలని అధికారులను ఆదేశించారు. అవసరమైన ప్రాంతాల్లో యూజీడీ నిర్మాణం, సీసీ రోడ్ల పనులు చేపట్టాలని, రాజేష్ థియేటర్ వద్ద రోడ్డు విస్తరణ, జంక్షన్ అభివృద్ధికి అడ్డుగా ఉన్న విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్‌ను మార్చాలని సూచించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్డు ప్యాచ్‌వర్క్ పనులను పూర్తి చేయాలని ఆదేశించారు.

కార్యక్రమాల్లో కార్పొరేటర్లు అడ్డాల గట్టయ్య, వెంగళ బాపు, తోట మమత, మెరుగు భూలక్ష్మి, స్వప్నప్రియ, నాయకులు విజయ్, కుమార్, అభిషేక్, భరత్, సాగి సంతోష్ రావు, టీపీఓ నవీన్, ఏఈ అన్వేష్ తదితరులు పాల్గొన్నారు.



# కాలునొప్పితో ఆస్పత్రిలో చేరి.. ప్రాణాలు కోల్పోయిన సర్పంచ్

- వైద్యుల నిర్లక్ష్యమే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణలు
- ఆస్పత్రి ఎదుట మృతదేహంతో ధర్నా..
- కౌంటర్‌కు నిప్పంటించిన ఆందోళనకారులు
- నిష్పక్షపాత విచారణతో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్





**భద్రాచలం, జూలై 25 (డిడి9 వార్త)**

భద్రాచలంలోని అంబేద్కర్ సెంటర్‌లో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామ సర్పంచ్ వెంకటరమణ (36) మృతి చెందిన ఘటన తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. వైద్యుల నిర్లక్ష్యం వల్లే మృతి సంభవించిందని ఆరోపిస్తూ కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం వరకు ఆస్పత్రి ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కొందరు ఆందోళనకారులు ఆస్పత్రిలోకి చొరబడి క్యాష్ కౌంటర్‌పై పెట్రోలు పోసి నిప్పంటించారు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం, వెంకటరమణ బుధవారం కాలునొప్పి కారణంగా భద్రాచలంలోని ప్రైవేట్ ఆస్పత్రిలో చేరారు. చికిత్స అనంతరం ఆరోగ్యం మెరుగుపడకపోగా అపస్మారక స్థితికి చేరుకున్నారని తెలిపారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఖమ్మంలోని మరో ఆస్పత్రికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు పేర్కొన్నారు. మృతదేహాన్ని ఖమ్మం నుంచి నేరుగా భద్రాచలంలోని సంబంధిత ఆస్పత్రి వద్దకు తీసుకొచ్చిన కుటుంబ సభ్యులు, వైద్యుల నిర్లక్ష్యమే మృతికి కారణమని ఆరోపిస్తూ ధర్నా నిర్వహించారు. అత్యవసర పరిస్థితిలో తమను రోగి వద్దకు అనుమతించలేదని, తమకు సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా చికిత్స చేశారని మృతురాలి భర్త ఆరోపించారు. శనివారం ఉదయం పాల్వంచ మండలం దంతెలబోరు గ్రామం నుంచి పెద్ద సంఖ్యలో గ్రామస్తులు, సీపీఐ నాయకులు, కార్యకర్తలు తరలిరావడంతో ఆస్పత్రి వద్ద ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాధ్యులైన వైద్యులు, సిబ్బందిపై చర్యలు తీసుకోవడంతో పాటు ఆస్పత్రిని సీజ్ చేయాలని వారు డిమాండ్ చేశారు. మృతురాలికి ఇద్దరు చిన్నారులు ఉన్నారని, కుటుంబానికి న్యాయం చేయాలని కోరారు. ఆందోళన తీవ్రరూపం దాల్చడంతో కొందరు ఆస్పత్రిలోకి ప్రవేశించి క్యాష్ కౌంటర్‌లోని సామగ్రిపై పెట్రోలు పోసి నిప్పంటించారు. సంఘటన స్థలంలో భారీగా మోహరించిన పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నించారు. ఇదిలా ఉండగా, ఈ ఘటనపై ఆస్పత్రి యాజమాన్యం మధ్యవర్తుల ద్వారా రాజీ ప్రయత్నాలు చేసినట్లు సమాచారం. మరోవైపు, వెంకటరమణ మృతి ఘటనపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీయాలని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ పొదెం వీరయ్య ప్రభుత్వాన్ని కోరారు.

## నీట్ పేపర్ లీకేజ్ వల్ల అమరులైన విద్యార్థులను స్మరించుకుంటూ అంబేద్కర్ సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ..

**మణుగూరు.జూలై 25(డి డి 9వార్త)**

నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ ఘటన దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో తీవ్ర ఆందోళన, ఆవేదన కలిగించిందని, ఈ ఘటనల నేపథ్యంలో మనోవేదనకు గురై అమరులైన విద్యార్థులను స్మరించుకుంటూ వారికి సంఘీభావం తెలియజేస్తూ మణుగూరు మండలంలోని అంబేద్కర్ సెంటర్‌లో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఏఐసీసీ, టీపీసీసీ మరియు పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు ఆదేశాల మేరకు ఈ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ మణుగూరు మండల అధ్యక్షులు పీరినాకి నవీన్, మణుగూరు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కురం రవి ముదిరాజ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు, టౌన్ అధ్యక్షులు, జిల్లా ముఖ్య నాయకులు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు, మైనారిటీ కాంగ్రెస్ అధ్యక్షులు, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ముఖ్య నాయకులు, మహిళా నాయకులు, యువజన నాయకులు, కాంగ్రెస్ శ్రేణులు, కార్యకర్తలు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, విద్యార్థుల భవిష్యత్తును నిర్ణయించే నీట్ వంటి జాతీయ స్థాయి పరీక్షల్లో పేపర్ లీకేజీలు, అక్రమాలు చోటుచేసుకోవడం అత్యంత దురదృష్టకరమని అన్నారు. ఇలాంటి ఘటనలు లక్షలాది మంది విద్యార్థులు, వారి కుటుంబాలను తీవ్ర ఆందోళనకు గురిచేస్తాయని పేర్కొన్నారు. ఎంతో కష్టపడి చదివి పరీక్షలకు సిద్ధమయ్యే విద్యార్థులకు న్యాయం జరిగేలా పరీక్షల నిర్వహణలో పూర్తి పారదర్శకత, బాధ్యత ఉండాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే విద్యార్థుల ఆశయాలను దెబ్బతీసే ఇటువంటి ఘటనలు ఇకపై పునరావృతం కాకుండా బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం అందరూ చేతుల్లో కొవ్వొత్తులు వెలిగించి మౌనం పాటిస్తూ నీట్ పేపర్ లీకేజ్ వల్ల అమరులైన విద్యార్థులను స్మరించుకొని వారికి సంఘీభావం ప్రకటిస్తూ ఘనంగా నివాళులర్పించారు.



## రామాలయంలో శ్రీరామాత్మవరుణ యాగం

- ఏకాదశి సందర్భంగా భక్తులతో కిటకిటలాడిన రామాలయం

**భద్రాచలం, జూలై 25 ( డిడి9 వార్త)**

భద్రాచలం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ పెరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భారీగా కదిలి వచ్చిన భక్తులతో ఆలయ ప్రాంతాలన్నీ రద్దీగా మారాయి. తెల్లవారుజాము నుంచే స్వామివారి దర్శనం కోసం భక్తులు భారీ సంఖ్యలో కదిలి రావడంతో క్యూలైన్లన్నీ భక్తులతో నిండిపోయాయి. బేడ మండపంలో జరిగే నిత్య కళ్యాణ వేడుకలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆషాడ మాసం తొలి ఏకాదశి సందర్భంగా స్వామివారి ఆలయంలో శ్రీరామాత్మక వరుణ యాగాన్ని నిర్వహిస్తున్నారు. వరుణ యాగాన్ని నిర్వహించడం ద్వారా దేశవ్యాప్తంగా వర్షాలు బాగా కురిసి పాడిపంటలు పండి దేశాభివృద్ధి జరుగుతుందని తద్వారా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని ఈ వరుణ యాగాన్ని నిరవకిస్తున్నట్లు ఆలయ అర్చకులు తెలిపారు. వరుణ యాగంలో భాగంగా ఆలయంలో ప్రత్యేక వేదికను ఏర్పాటు చేసి స్వామి వారిని వేంచేయింపజేశారు. తొలుత విశ్వక్సేనార్చన, పుణ్యాహావనం గావించారు. అనంతరం చతుర్వేద పారాయణం, వాసుదేవ సంఘరణ, కలశాలలో ఆవాహనను ఆగమశాస్త్రం ప్రకారం వైదిక బృందం నిర్వహించారు. అనంతరం హోమ కలశాలోని జలాలతో సహస్రధారాభిషేకం నిర్వహించారు. రామచంద్రప్రభువు దయతో అతివృష్టి కలిగి నదులన్నీ జలాలతో నిండాలని, రైతులంతా సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.



## నూతన మీ సేవ కేంద్రంను ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్.

**ఆదిలాబాద్ జిల్లా**
**తలమడుగు మండలం( DD9 వార్త)**

తలమడుగు మండలంలోని కుచిలాపూర్ గ్రామంలో. నూతన మీసేవ కేంద్రం ను ప్రారంభించిన బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో. ఎమ్మెల్యే మాట్లాడుతూ. మారుమూల ప్రాంతాలలో. ప్రభుత్వ సేవలు సులభతరం అయ్యేలా మీ సేవ కేంద్రం ఉపయోగపడుతుందని. ఆదాయ కుల సర్టిఫికెట్లు రేషన్ కార్డులు పెన్షన్ వివిధ రకాల ప్రభుత్వ దరఖాస్తులు. ఏవైనా ఇకనుండి గ్రామంలోని అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.అనంతర 10 లక్షల నిధులతో స్త్రీ శక్తి భవనానికి భూమి పూజ చేశారు. ఎమ్మెల్యేగా. మారుమూల ప్రాంతాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తున్నట్లు. తెలిపారు రైతుల కోరిక మేరకు త్వరలోనే విద్యుత్ సబ్ స్టేషన్ పనులు మొదలుపెడతామని. ఆయన తెలిపారు ఈ కార్యక్రమంలో. ప్రజా ప్రతినిధులు. అధికారులు. గ్రామస్తులు. యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు



## వరి, చెరుకు పంటల్లో సమగ్ర సస్య రక్షణ చర్యలు పాటించాలి

- రుద్రూరు శాస్త్రవేత్తల క్షేత్రస్థాయి పరిశీలన
- సాలూర మండలంలో రైతుల పొలాల సందర్శన

**బోధన్, నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

ప్రాంతీయ చెరుకు, వరి పరిశోధనా స్థానం రుద్రూరు శాస్త్రవేత్తల బృందం సాలూర మండలంలోని హున్సా, మందర్న గ్రామాల్లో శనివారం విస్తృతంగా పర్యటించి రైతుల పొలాలను పరిశీలించింది. ప్రస్తుతం రైతులు సాగు చేస్తున్న వరి, చెరుకు పంటలను పరిశీలించిన శాస్త్రవేత్తలు.. అక్కడ గమనించిన తెగుళ్లు, పురుగుల నివారణకు తక్షణమే తీసుకోవాల్సిన సస్య రక్షణ చర్యలపై అన్నదాతలకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా వరి సాగుపై మాట్లాడుతూ.. ప్రస్తుతం నమోదవుతున్న అధిక పగటి ఉష్ణోగ్రతలు, తక్కువ రాత్రి ఉష్ణోగ్రతల వాతావరణం కాండం తొలిచే పురుగు ఉధృతికి పూర్తి అనుకూలంగా మారుతోందని తెలిపారు. దీని నివారణకు నాట్లు వేసిన 25 రోజులకు రైతులు ఎకరాకు తప్పనిసరిగా 10 కిలోల చొప్పున కార్బోఫ్యూరాన్ 3జి గుళికలు వేసుకోవాలని సూచించారు. పురుగుల ఉనికిని ఎప్పటికప్పుడు పసిగట్టేందుకు ఎకరాకు 5 నుంచి 6 చొప్పున లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలని, ఉధృతి తీవ్రంగా ఉన్నట్లయితే ఎకరాకు 400 గ్రాముల కార్టాప్ హైడ్రోక్లోరైడ్ లేదా 60 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారి చేసుకోవాలని పేర్కొన్నారు. వరిలో బ్యాక్టీరియా ఎండాకు తెగులు ఆశించిన పొలాల్లో తక్షణమే యూరియా వేయడం నిలిపివేయాలని హెచ్చరించారు. వ్యాధి సోకిన మడి నుంచి కింది పొలాలకు నీరు పారకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, తెగులు మరింత వ్యాపించకుండా అరికట్టేందుకు ఎకరాకు 80 గ్రాముల ప్లాంటమైసిన్ మరియు 600 గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ కలిపి పిచికారి చేయాలని సలహా ఇచ్చారు. మరోవైపు చెరుకు సాగు చేస్తున్న పొలాల్లోనూ కాండం తొలిచే పురుగు ఉధృతిని గుర్తించిన శాస్త్రవేత్తలు.. దాని నియంత్రణకు ఎకరాకు 500 మిల్లీలీటర్ల క్లోరిపైరిఫాస్ లేదా 150 మిల్లీలీటర్ల క్లోరాంట్రానిలిప్రోల్ పిచికారి చేయాలని సూచించారు. ప్రస్తుతం నెలకొన్న వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు లభ్యమయ్యే నీటిని అత్యంత సమర్థవంతంగా వినియోగించుకోవాలని, పంట ఎట్టి పరిస్థితుల్లోనూ నీటి ఎద్దడి (బెట్ట) బారిన పడకుండా జాగ్రత్త వహించాలని పిలుపునిచ్చారు.



## ప్రాణాపాయంతో పోరాడుతున్న చిన్నారికి కొండంత అండ..



**జూలై25 డిడి9 వార్త వెంకటాపురం.**

సేవే లక్ష్యంగా, ప్రజా సేవే మార్గంగా ముందుకు సాగుతున్న శ్రీరామకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, బీఆర్ఎస్ పార్టీ ములుగు జిల్లా యువ నాయకులు బాడిశ నాగరమేష్ మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకున్నారు. ములుగు జిల్లా వెంకటాపురం మండలం బెస్తగూడెం గ్రామానికి చెందిన రాజేష్-మమత దంపతుల ఐదేళ్ల చిన్నారి జన్యుపరమైన ఎముకల సంబంధిత ఆరోగ్య సమస్యతో బాధపడుతున్న విషయం తెలుసుకున్న బాడిశ నాగరమేష్ వారి ఇంటికి వెళ్లి చిన్నారి ఆరోగ్య పరిస్థితిని స్వయంగా తెలుసుకున్నారు. అనంతరం చిన్నారి తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పించి, వైద్య ఖర్చుల నిమిత్తం రూ.15,000 ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా "ప్రజల కష్టాల్లో అండగా నిలవడమే నిజమైన ప్రజా సేవ" అని బాడిశ నాగరమేష్ తెలిపారు. చిన్నారి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బెస్తగూడెం సర్పంచ్ బట్ట బిమేశ్వరి, జిల్లా నాయకులు మంచర్ల నాగేశ్వరరావు, బట్ట నాగేంద్ర బాబు, వీరభద్రవరం సర్పంచ్ సాలం ఓంపతి, కొమరం పుల్లారావు, పండ శ్రీను, రూప భద్రయ్య, సంతోష్, బన్ను, మాటూరి వెంకటేశ్వర్లు, బట్ట పురుషోత్తం, సుదర్శన్, దారాజు కృష్ణమూర్తి, బెగా సాంబశివరావు, రామేళ్ల రాజశేఖర్, రాకేష్, లక్ష్మీనారాయణ, రంజిత్, బట్ట జగదీష్, చంటి, గోవర్ధన్, వంశీ, వెంకటేష్, వీరాస్వామి, సోషల్ మీడియా వారియర్ మునిగేల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## రామాలయంకు రూ.4 లక్షల విరాళం

**భద్రాచలం, జూలై 24 డిడి9 వార్త**

భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్రస్వామి వారి ఆలయంకు శనివారం రూ.4 లక్షలు విరాళంను హైదరాబాద్‌కు చెందిన మల్లేశ్వరి వరప్రసాద్ దంపతులు అందజేశారు. దేవస్థానం నిత్యన్నదాన పథకంకు రూ.3 లక్షలు, గోశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. ఈ విరాళంను ఆలయ పర్యవేక్షకులు లింగాల సాయిబాబా అందజేశారు.





## భక్తి పారవశ్యంలో బోధన్.. వైభవంగా శయన ఏకాదశి వేడుకలు

- గోవింద నామస్మరణతో మార్మోగిన వైష్ణవాలయాలు
- పోటెత్తిన భక్తులు.. విశేష పూజలు, అలంకరణలు

**బోధన్, నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

ఆషాఢ మాస శయన ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని బోధన్ పట్టణంలో శనివారం నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా, ఆధ్యాత్మిక శోభ మధ్య సాగాయి. పట్టణంలోని శ్రీ మారుతి మందిరంలోని శ్రీ రుక్మిణి విఠలేశ్వరస్వామి ఆలయం, నర్సిరోడ్‌లోని శ్రీ బాలాజీ మందిరం, వెంకటేశ్వర కాలనీలోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయం, బ్రాహ్మణగల్లిలోని శ్రీ రుక్మిణి విఠలేశ్వరస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే వేద పండితుల వేదమంత్రోచ్చారణల నడుమ స్వామివార్లకు పవిత్ర అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. అనంతరం తులసి మాలలు, సుగంధ భరిత పుష్పమాలలతో స్వామివారిని విశేషంగా అలంకరించారు. కాకడ హారతి, మహా మంగళహారతుల వేళ ఆలయాలు భక్తుల గోవింద నామస్మరణలతో మార్మోగాయి. ఆలయ ప్రాంగణాల్లో "జై పాండురంగ", "విఠల విఠల పాండురంగ", "నమో భగవతే వాసుదేవాయ", "నమో వెంకటేశాయ", "శ్రీరామ", "హరే రామ హరే కృష్ణ" నామసంకీర్తనలు మార్మోగాయి. భక్తులు భజనలు, నామస్మరణలతో భక్తి పారవశ్యంలో మునిగిపోయి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ వేడుకల్లో మహిళలు, యువకులు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు ఆచరించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. వేద పండితుల ఆశీర్వచనాలతో భక్తులు స్వామివారి కృపను పొందారు. ఆషాఢ శయన ఏకాదశి సందర్భంగా జరిగిన ఈ వేడుకలు బోధన్ పట్టణంలో అత్యంత కన్నుల పండువగా జరిగాయి.





# రూ. 60 కోట్ల ప్రగతి పనుల్లో జాప్యం వద్దు.. నాణ్యతతో పూర్తి చేయాలి

- **నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా**
- **అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం**

**నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

నియోజకవర్గ పరిధిలో కొనసాగుతున్న ప్రధాన ప్రగతి పనులను ఎలాంటి అలసత్వం లేకుండా వేగవంతంగా పూర్తి చేయాలని నిజామాబాద్ అర్బన్ శాసనసభ్యులు ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా అధికారులను ఆదేశించారు. స్థానిక క్యాంపు కార్యాలయంలో ప్రజాఆరోగ్య, రోడ్లుభవనాల శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిధులు రూ. 60 కోట్లతో నగరంలో చేపట్టిన వివిధ అభివృద్ధి పనుల పురోగతిపై సుదీర్ఘంగా చర్చించారు. పనుల నిర్వహణ కారణంగా నగర ప్రజలకు రవాణా పరంగా గానీ, ఇతర సేవల్లో గానీ ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. నిర్మాణ పనులను మరింత వేగవంతం చేయడంతో పాటు, నాణ్యతా ప్రమాణాల్లో ఎక్కడా రాజీ పడకుండా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ప్రజలకు మెరుగైన మౌలిక వసతుల కల్పనే లక్ష్యంగా తాము పనిచేస్తున్నామని, నిధులు మంజూరైన పనుల్లో జాప్యం జరగకుండా క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో ప్రజాఆరోగ్య, ఆర్అండ్‌బీ శాఖల ఇంజనీరింగ్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# బీమా సంస్థల మోసాలు.. వినియోగదారులకు వేధింపులు

- **నిబంధనల పేరుతో క్లెయిమ్‌ల తిరస్కరణపై వరల్డ్ కన్స్యూమర్ రైట్స్ ధ్వజం**
- **బాధితులు న్యాయపోరాటం చేయాలని పిలుపు**

**నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**



వైద్య అత్యవసర సమయాల్లో ఆదుకోవాల్సిన ఆరోగ్య బీమా కంపెనీలు నిబంధనలను సాకుగా చూపుతూ వినియోగదారులను వేధింపులకు గురిచేస్తున్నాయని ప్రపంచ వినియోగదారుల హక్కుల రక్షణ సంస్థ నిజామాబాద్ జిల్లా చైర్మన్ డాఖా దుర్గాప్రసాద్ ఆరోపించారు. పాలసీ విక్రయించే సమయంలో ఒకలా వ్యవహరించే సంస్థలు, క్లెయిమ్ ఇచ్చే సమయానికి నిబంధనల పేరుతో కొర్రీలు పెడుతున్నాయని ఆయన మండిపడ్డారు. ప్రజలు ఎంతో నమ్మకంతో ఏటా ప్రీమియంలు చెల్లిస్తున్నప్పటికీ ఆపద సమయంలో బీమా కంపెనీల నుంచి సరైన స్పందన కరవవుతోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి మోసపూరిత ధోరణుల కారణంగా బాధితులు ఆర్థికంగా, మానసికంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. మోసపూరిత బీమా కంపెనీల బారిన పడిన బాధితులు ఎవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని తగిన ఆధారాలతో వినియోగదారుల ఫోరమ్‌ను ఆశ్రయించి న్యాయం పొందవచ్చని సూచించారు. వినియోగదారుల హక్కుల పరిరక్షణ కోసం తమ సంస్థ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన స్పష్టం చేశారు.

# వాయిదా పడ్డ బీఈడీ, బీపీఈడీ పరీక్షల రివైజ్డ్ షెడ్యూల్ విడుదల

- **ఆగస్టు 4న పరీక్షల నిర్వహణ**

**నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

తెలంగాణ విశ్వవిద్యాలయ పరిధిలోని (అనుబంధ కళాశాలలతో సహా) బీఈడీ 2, 3 మరియు బీపీఈడీ 2, 3 సెమిస్టర్ల పరీక్షల సవరించిన షెడ్యూల్‌ను కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఆచార్య సంపత్ కుమార్ శనివారం వెల్లడించారు. ఈ నెల 24న జరగాల్సిన పరీక్షలను విద్యాసంస్థల బంద్ నేపథ్యంలో అధికారులు వాయిదా వేసిన విషయం తెలిసిందే. తాజాగా ఆ వాయిదా పడ్డ పరీక్షలను ఆగస్టు 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. సంబంధిత విద్యార్థులందరూ ఈ మార్పును గమనించి, సవరించిన షెడ్యూల్ ప్రకారం పరీక్షలకు హాజరు కావాలని సూచించారు.

# మేడ్చల్ నూతన సిఐ కి శుభాకాంక్షలు తెలిపిన విష్ణు వర్ధన్ రెడ్డి


**మేడ్చల్ డీడీ9 వార్త:**

మేడ్చల్ నూతన సిఐగా పదవి బాధ్యతలు స్వీకరించిన అంజిరెడ్డి ని టాటా వాటర్ మేడ్చల్ డిస్ట్రిబ్యూటర్ వీర్ల పల్లి విష్ణు వర్ధన్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదర్శ్ రెడ్డిలతో పాటు తదితరులు పాల్గొన్నారు










# గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై డీజీపీ వీడియో కాన్ఫరెన్స్

- **నిజామాబాద్ కమిషనరేట్ పరిధిలోని ఘాట్ల ఏర్పాట్లపై ప్రత్యేక సమీక్ష**
- **పకడ్బందీ భద్రత, ట్రాఫిక్ నియంత్రణకు డీజీపీ ఆదేశాలు**

**నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

రాబోయే గోదావరి పుష్కరాలలో భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అత్యంత సురక్షితంగా, ప్రశాంతంగా నిర్వహించేందుకు తెలంగాణ రాష్ట్ర డీజీపీ మహేష్ భగవత్ గోదావరి పరివాహక ప్రాంతాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లతో శనివారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో పుష్కరాల సందర్భంగా చేపట్టాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, భక్తుల రద్దీ నిర్వహణ, అత్యవసర సేవల సమన్వయం, విపత్తు నిర్వహణ, కమ్యూనికేషన్ వ్యవస్థల బలోపేతం తదితర కీలక అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని రెంజల్, మెండోరా, ఏర్గట్ల పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న పుష్కర ఘాట్ల వద్ద చేపడుతున్న ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చించారు. భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకుని తాత్కాలిక పోలీస్ అవుట్‌పోస్టుల ఏర్పాటు, ఆధునిక సౌకర్యాలతో కమాండ్ అండ్ కంట్రోల్ హాల్ నిర్మాణం, సీసీటీవీ కెమెరాల విస్తరణ, డ్రోన్ నిఘా, పబ్లిక్ అడ్రస్ సిస్టమ్, బ్యారికేడింగ్, పార్కింగ్ ప్రణాళిక, ట్రాఫిక్ మళ్లింపు మార్గాలు, అలాగే మహిళలు, చిన్నారులు, వృద్ధుల కోసం ప్రత్యేక సహాయక కేంద్రాల ఏర్పాటుపై తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. పుష్కరాల సమయంలో భారీగా తరలివచ్చే భక్తుల రద్దీని అంచనా వేస్తూ క్యూ లైన్ల నిర్వహణ, విపత్తు నిర్వహణ బృందాల సిద్ధత, అగ్నిమాపక, వైద్య, ఎన్డీఆర్ఎఫ్/ఎస్డీఆర్ఎఫ్ బృందాలతో సమన్వయం, తాగునీరు, లైటింగ్, పారిశుద్ధ్యం, తప్పిపోయిన వారి గుర్తింపు కోసం ప్రత్యేక కేంద్రాలు వంటి అంశాలపై విస్తృతంగా చర్చించారు. ప్రతి పోలీస్ యూనిట్ ముందస్తు కార్యాచరణ ప్రణాళికతో సిద్ధంగా ఉండాలని, ఇతర శాఖలతో సమన్వయం పెంచుకుని భక్తులకు అద్భుతమైన వసతులు కల్పించేలా పకడ్బందీ చర్యలు చేపట్టాలని డీజీపీ అధికారులను ఆదేశించారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ కార్యాలయం నుంచి నిర్వహించిన ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి. సాయి చైతన్య, అదనపు డీసీపీ (అడ్మిన్) ఎన్. శుభం ప్రకాశ్, నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ ఏసీపీలు ప్రకాష్, వెంకటేశ్వర రెడ్డి, శ్రీనివాస్, ఎస్బీ ఇన్స్పెక్టర్లు ధర్ రెడ్డి, మల్లేష్, గోదావరి పరివాహక ప్రాంతాల సీఐలు, ఎస్సైలు, ఆఫీస్ సూపరింటెండెంట్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# నిక్షయ మిత్రలుగా ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థుల నమోదు

- **జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు పకడ్బందీ చర్యలు**
- **ప్రతి మండలానికి క్లాస్ వన్ అధికారుల నియామకం**
- **డీఎంహెచ్ఓ బి.రాజశ్రీ**

**నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలన లక్ష్యంగా అమలు చేస్తున్న టీబీఎంబీఏ కార్యక్రమాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రతి మండలం నుంచి ఐదుగురు ఎన్సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులను నిక్షయ మిత్రలుగా నమోదు చేయాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.రాజశ్రీ ఆదేశించారు. శనివారం జిల్లా టీబీ సిబ్బందితో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆమె మాట్లాడుతూ.. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న టీబీ రోగుల సన్నిహితులందరికీ టీబీ ప్రివెంటివ్ ట్రీట్మెంట్ అందించే ప్రక్రియను వేగవంతం చేయాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఈ వైద్య సేవలు అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలోని ప్రతి మండలానికి టీబీ కార్యక్రమాల పర్యవేక్షణ, సమన్వయం మరియు పురోగతిని నిశితంగా పరిశీలించేందుకు ఒక క్లాస్ వన్ అధికారిని నియమించినట్లు ఆమె తెలిపారు. ఈ అధికారులు మండల స్థాయిలో టీబీ నియంత్రణ కార్యక్రమాలు సజావుగా సాగేలా పర్యవేక్షిస్తారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా క్షయవ్యాధి నియంత్రణ అధికారి డాక్టర్ దేవి నాగేశ్వరి, ఏవో సుశాంత్ కుమార్, టీబీ కోఆర్డినేటర్లు లక్ష్మణ్, రవి గౌడ్, నరేష్, డీహెచ్ఈ ఘన్‌పూర్ వెంకటేశ్వర్లు తదితర జిల్లా టీబీ నియంత్రణ సిబ్బంది పాల్గొన్నారు.





# విఠలేశ్వర మందిర నిర్మాణానికి దాతల విరాళాలు

**బోధన్, నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

రెంజల్ మండల కేంద్రంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న విఠలేశ్వర మందిర నిర్మాణ పనులకు పలువురు దాతలు శనివారం ఉదారంగా ముందుకు వచ్చి తమ వంతు విరాళాలు అందజేశారు. దేవుని మందిర నిర్మాణానికి లక్ష్మారెడ్డి నగదు రూపంలో విరాళం అందించగా, అశోక్ విగ్రహాలను సమకూర్చారు. స్థానిక ప్రైవేటు పాఠశాల యాజమాన్యం భవన నిర్మాణ నిమిత్తం 5 వేల ఇటుకలను విరాళంగా అందజేసింది. దైవకార్యమైన ఈ విఠలేశ్వర మందిర నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేసేందుకు దాతలందరూ ఇలాగే మరిన్ని విరాళాలు, సాయం అందించాలని ఆలయ కమిటీ సభ్యులు పిలుపునిచ్చారు. భవిష్యత్తులోనూ గ్రామస్థులు, దాతలు అందించే సహకారంతో ఆలయ నిర్మాణాన్ని ఘనంగా పూర్తి చేస్తామని వారు తెలిపారు.






# చౌట్ పల్లి లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో వైభవంగా ఏకాదశి వేడుకలు

- **అమర్నాథ్ చారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు**
- **భక్తులకు తులసి మొక్కల పంపిణీ**

**నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

తొలి ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని కమ్మర్‌పల్లి మండల పరిధిలోని చౌట్ పల్లి గ్రామంలో గల శ్రీ లక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు అత్యంత వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల అమర్నాథ్ చారి ఆధ్వర్యంలో వేదమంత్రాల సాక్షిగా స్వామివారి మూలవిరాట్‌కు శాస్త్రోక్తంగా పంచామృతాభిషేకాలు, విశేష అర్చనలు, నైవేద్య సమర్పణ తదితర ధార్మిక కార్యక్రమాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. పర్వదినం కావడంతో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ పవిత్ర సందర్భాన్ని పురస్కరించుకుని గ్రామ సర్పంచ్, వార్డు సభ్యుల పాలకమండలి మరియు గ్రామ అభివృద్ధి కమిటీ సంయుక్త సమన్వయంతో ఆలయానికి వచ్చిన భక్తులకు ఉచితంగా తులసి మొక్కలను పంపిణీ చేశారు. గ్రామ సంస్థలన్నీ ఏకమై చేపట్టిన ఈ వినూత్న పర్యావరణఆధ్యాత్మిక కార్యక్రమం భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పర్యావరణ పరిరక్షణతో పాటు ఆధ్యాత్మికతను పెంపొందించేలా గ్రామ పాలకవర్గం, వీడీసీ తీసుకున్న ఈ నిర్ణయంపై సర్వత్రా హర్షం వ్యక్తమైంది. ఈ వేడుకల్లో ఆలయ ప్రధాన అర్చకులు సముద్రాల అమర్నాథ్ చారితో పాటు గ్రామ సర్పంచ్ మహబూబ్, వీడీసీ అధ్యక్షుడు ప్రవీణ్, ఉపాధ్యక్షుడు రవీందర్, పాలకమండలి వార్డు సభ్యులు, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# బోధన్‌లో విషాదం.. రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

- **మరొకరికి తీవ్ర గాయాలు**

**బోధన్, నిజామాబాద్, 25 జూలై (డీడీ9 వార్త):**

బోధన్ పట్టణ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో రాకాసిపేటకు చెందిన శ్రావణ్ (35) మృతి చెందగా, మరో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. బోధన్ సీఐ వేంకట నారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 5:30 గంటల సమయంలో రాకాసిపేటకు చెందిన ఇద్దరు వ్యక్తులు బైక్‌పై పెగడపల్లి బైపాస్ రోడ్డు నుంచి రాకాసిపేట వైపు వెళుతున్నారు. మార్గమధ్యలో బొర్రా గణపతి బైపాస్ జంక్షన్ వద్దకు చేరుకోగానే వీరు ప్రయాణిస్తున్న బైక్‌ను ట్రాక్టర్ వేగంగా వచ్చి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్ నడుపుతున్న శ్రావణ్ తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న రాకేష్‌కు తీవ్ర గాయాలు కావడంతో, వెంటనే అప్రమత్తమై మెరుగైన చికిత్స కోసం అతన్ని నిజామాబాద్ జిల్లా ఆసుపత్రికి తరలించారు. మృతుడు శ్రావణ్ తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ట్రాక్టర్ ఢీకొట్టడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్లు నిర్ధారించి, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఆయన వెల్లడించారు.

This newspaper/periodical is published by BATHULA KUMAR RAJA from PLOT 620, ROAD NO. 34, SURVEY OF INDIA AYYAPPA SOCIETY, CHANDA NAIK NAGAR, MADHAPUR, RANGAREDDY, TELANGANA - 500201. on behalf of BATHULA KUMAR RAJA, edited by BATHULA KUMAR RAJA and printed by NAGAVARAM SREENIVAS RAO at GARUDA PRINTERS, at H.NO.2-86/1, PLOT NO 26-SP, SY NO 420, SAGAR HIGH WAY, RAGANNAGUDA VILLEGE, ABDULLAPUR MANDAL, RANGAREDDY, TELANGANA - 502510.